


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 18-1-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 287 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ. 2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.50-12.37; దుర్ముహూర్తం: ఉ. 6.52-8.21; అమృతఘడియలు: ఉ. 7.53-9.37; రాహుకాలం: ఉ. 9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | తాడేపల్లిగూడెం సిటీ

Tadepalligudem | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar |Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కోతలకు చెక్

- జిల్లాలో సముద్రకోత నివారణకు చర్యలు
- కిలోమీటరు మేర రక్షణ గోడ నిర్మాణం
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,300 కోట్లు
- తొలి విడతగా పీఎం లంక వద్ద పనులు
- రూ.13.50 కోట్లతో టెండర్లు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చొరవ


కోతకు గురవుతున్న సముద్రం

-3లో


పోలీస్ సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సిబ్బందికి ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ హామీ ఇచ్చారు. జిల్లాలో పని చేస్తున్న సివిల్ పోలీస్, ఏఆర్, హోం గార్డుల సమస్యలు పరిష్కారానికి ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సంక్షేమ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరితో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు.


చింతలపూడి మెయిన్ రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

చింతలపూడిలో ఆక్రమణల తొలగింపు

చింతలపూడి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మునిసిపాలిటీలో రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం మునిసిపల్ అధికారులు చేపట్టారు. రోడ్డుకు ఇరుపక్కలా డ్రెయినేజీలపై ఆక్రమణలు, డ్రెయినేజీలు దాటి ఏర్పాటు చేసిన బోర్డులు, సెంట్రల్ లైటింగ్ స్తంభాలపై ఫ్లెక్సీలు, విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వాణిజ్య ప్రకటనల బోర్డులను తొల గిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శారద మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగిస్తున్నట్టు తెలిపారు.

కొల్లేరులో కంగారు


చేపల చెరువుకు తవ్వి చదును చేసిన వైనం


కొల్లేరులో చేపల చెరువుల సాగు

మంచినీటి సరస్సు కబ్జాలపై సుప్రీం కన్నెర్ర

- ఆక్రమణల తొలగింపునకు స్పష్టమైన ఆదేశాలు.. సరిహద్దు నిర్ధారణకు మూడు నెలల గడువు
- ఉన్నత న్యాయస్థానం తీర్పుతో కలకలం.. ఇప్పటికే 15 వేల 339 ఎకరాల్లో ఆక్రమణల గుర్తింపు
- స్థానిక సంస్థలు, సంబంధిత శాఖలకు సవాలు.. స్థానికులను చైతన్యపరిచేందుకు చర్యలేమిటి ?



• సుప్రీం పెట్టిన పరీక్ష

కొల్లేరులో ఆక్రమణకు పాల్పడి చేపల చెరువులు తవ్వి ఇన్నాళ్ళ భోగం అనుభవించిన వారికే కాకుండా స్థానిక సంస్థలకు పెను సవాల్ కాబోతుంది. సరస్సు సమీప ప్రాంతంలోని పట్టణాలు, పల్లెల నుంచి వచ్చే వ్యర్థాలన్నీ కొల్లేరుకు చేరకుండా తక్షణం నిరోధించాల్సిందేనని సుప్రీం ఉత్తర్వులను అమలు చేయకతప్పదు. ఈ తరహా వ్యర్థాలన్నింటినీ ఎటువైపు మళ్లించా లనేది ఇప్పుడు కొత్త ప్రశ్న. ఆక్రమిత ప్రాంతంలో చేప ల పెంపకానికి అనువుగా వాడుతున్న రసాయనాలు, ఎరువులు ఇకపై అనుమతించేది లేదని స్పష్టమైన ఆదేశాలతో వీటి కట్టడి పెనుసవాలే. ఒకవైపు ఆక్రమణదా రులకు, ఇంకోవైపు స్థానిక సంస్థలకు, మరోవైపు సంబంధిత శాఖలకు సుప్రీం పెద్ద పరీక్ష పెట్టింది.

కొల్లేరు కబ్జా కోరులపై సుప్రీంకోర్టు మరొకసారి కన్నెర్ర చేసింది. మూడు నెలల్లో దీని సరిహద్దులు గుర్తించాలని ఆదేశాలు జారీచేసింది. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలో ఎలాంటి ఆక్రమణలు, సహజ సిద్ద నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు ఉండరాదని స్పష్టం చేసింది. ఇప్పటికే అధికారం, కండబలంతో అధికారుల కళ్లు గప్పి నిర్విఘ్నంగా కొల్లేరులో చెరువులు తవ్విన వారికి షాక్ ఇచ్చింది. జిరాయితీ భూముల పరిహారం, రీడార్ సర్వేపై యధాతధ స్థితిని కొనసాగింపుపై ప్రజా ప్రతినిధులు పట్టుబడుతున్న తరుణంలోనే సుప్రీం కొరడా విదిలించింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కొల్లేరు సహజ సిద్ధమైన మంచినీటి సరస్సు దీని అంతర్భాగంలో దురాక్రమణలు. చేపల చెరువులు పేరిట వేల ఎకరాల్లో తవ్వకాలు చేపట్టారు. వాతావరణం దెబ్బ తీసేలా ఎరువులు, పురుగు మందుల వాడకంతో మంచినీటి సరస్సు స్థానంలో మురుగు కాసారమైంది. సహజ సిద్ధంగా పెరిగే చేపలు తగ్గుముఖం పట్టాయి. సుదూరం నుంచి ప్రయాణిస్తూ కొల్లేరుకు చేరుకుని కాస్తంత రిలీఫ్ పొందే విదేశీ పక్షుల ఆవాసం దెబ్బ తింది. ఈ పరిస్థితుల్లో పర్యావరణ వేత్తలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కొల్లేరుకు తిరిగి పునఃస్వరూపం లభించేలా సుప్రీం సాధికార కమిటీ రంగంలోకి దిగింది. 2006లో కొల్లేరులో దరాక్రమణకు గురైన ప్రాంతంలో కొందరు చెరువులను మూడు నెలలకుపైగా శ్రమించి ధ్వంసం చేశారు. స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమైనా రాజకీయ ఒత్తిళ్లు పెరిగినా అప్పటి కలెక్టర్ లవ్ అగర్వాల్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం కొల్లేరు ఆపరేషన్‌ను యధావిధిగా కొనసాగించింది. గట్లను బాంబులతో పెల్చేసి ధ్వంసం చేశారు. కొల్లేరు ఆపరేషన్‌లో 70 వేల ఎకరాల్లో వున్న చెరువులను పూర్తిగా తొలగించారు. కొల్లేరు, వన్యప్రాణి సంరక్షణ ముఖ్యమని అప్పట్లో సుప్రీంకోర్టు ప్రకటించింది. ఎవరైనా గీత దాటితే తక్షణ చర్యలు తీసుకోవాలని అటవీ శాఖకు ఆదేశాలు అందాయి. ఈ ఆపరేషన్ జరిగి 19 ఏళ్ల అయ్యింది. ఈ నేపథ్యంలో మరొకసారి కొల్లేరులో దురాక్రమణలు, వన్యప్రాణి సంరక్షణ వ్యవహారం సుప్రీంలో విచారణకు వచ్చింది. కాకినాడ జిల్లాకు చెందిన ఒకరు దాఖలు చేసిన వ్యాజ్యం పరిగణనలోకి తీసుకుని ఇప్పటికీ పర్యావరణానికి విరుద్ధంగా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంను దెబ్బ తీసే విధంగా వేల ఎకరాల్లో తిరిగి చెరువులు తవ్వినట్టు నిర్ధారణకు వచ్చారు. కొల్లేరు భూభాగంలో ప్రకృతి సిద్ధంగా నీటి ప్రవాహం ముందుకు సాగాలే తప్ప, దీనిని ఆటంకపరిచేలా ఎలాంటి అడ్డంకులున్నా సహించేది లేదన్న సుప్రీం ఆగ్రహం కొల్లేరులో కలకలం సృష్టించింది.

కండబలంతో కొల్లేరు నాశనం

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ అనుకూలురు కొల్లేరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అధికారులను ఏమార్చి కొన్నిచోట్ల, వారితో కుమ్మక్కై మరికొన్నిచోట్ల చేపల చెరువుల తవ్వకాలకు సాహసిస్తున్నారు. చాలాసార్లు కొల్లేరులో కాంటూరు పరిధికి ముసుగేసి మరీ చెరువుల పేరిట దురాక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా తేలిగ్గా తీసుకుంటూ వచ్చారు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి నష్టం వాటిల్లుతుందని, కొల్లేరు భూభాగంలో సహజ నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందని స్థానికులు మొత్తుకుంటున్నా ఎవరికీ పట్టకుండాపోయింది. పర్యావరణ పరిరక్షణకు అనుకూలురు కొల్లేరు భూభాగంలో మూడో కంటికి తెలియకుండా జరుగుతున్న ఆక్రమణలపై పదే పదే ఆగ్రహం చెందుతూనే వచ్చారు. వివిధ వర్గాలకు చెందిన వ్యక్తుల నియంత్రణలో 15 వేల 339 ఎకరాల కొల్లేరు భూములు ఉన్నట్టు గుర్తించారు. 2006 తర్వాత కైకలూరు, ఉండి, ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో అత్యధికులు ఈ ఆక్రమణలకు పాల్పడ్డారు. అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగి కొన్నిచోట్ల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసినప్పటికీ పూర్తిస్థాయిలో విఫలమయ్యారు.

కొల్లేరు సమస్యలపై గళం

కొల్లేరులో సమస్యలపై స్థానిక ప్రజా ప్రతినిధులు గళం విప్పుతూనే వచ్చారు. ఈ మధ్యనే జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు వీటిని ప్రస్తావించారు. రీడార్ సర్వేకు సంబంధించి యధాతధ స్థితిని కొనసాగించాలని, జిరాయితీ భూముల వ్యవహారంలో యజమానులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈలోపే సుప్రీం ఆదేశాలతో అందరూ కలవరపడుతున్నారు. 2006లో కొల్లేరు ఆపరేషన్ జరిగినప్పుడు వివిధ కారణాలతో అనేక మంది వీధులకెక్కారు. వారికి పరోక్షంగా స్థానిక ఎమ్మెల్యేలు వంతపాడారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తుగా స్థానికులను చైతన్య పర్చాల్సిందిగా సుప్రీం సూచన చేయడం గమనార్హం. కొల్లేరులో సహజ సిద్ధమైన వేట ద్వారా బతికేందుకు స్థానికులెవరికీ ఆటంకాలు రాబోవని, కేవలం దురాక్రమణలు మాత్రం తొలగింపే లక్ష్యంగా పేర్కొంటున్నారు. వివిధ పార్టీల అనుకూలురే ఈ దురాక్రమణలకు పాల్పడినందున సహజంగానే వీరి పరోక్ష ప్రభావం స్థానికులపై ఉంటుంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ సారైనా ఆ ఆక్రమణల తొలగింపుకు అందరూ సహకరించాలన్న వాదనకు ఇక ముందు ఏ రూపంలో స్థానికులు ప్రతిస్పందించారనేది ఒక ప్రశ్న. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఎలాంటి చర్యలు తీసుకోబోతుందోనన్న చర్చ ప్రారంభమైంది. కొల్లేరులో ఇన్నాళ్లు దందా సాగించిన వారంతా తాజా పరిణామాలతో బిక్కచచ్చిపోయారు. వేలాది ఎకరాల్లో చెరువులు తవ్వడానికి పెట్టుబడులు పెట్టి తిరిగి దానిని రాబట్టుకునేందుకు లీజు పేరిట మరికొందరి నుంచి వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారమంతా ఇప్పటికే బహిర్గతం.

> కొల్లేరులోని వేల ఎకరాల్లో ఉన్న చెరువులను తుడిచిపెట్టేలా సుప్రీం తీసుకున్న నిర్ణయాన్ని పర్యావరణ వేత్తలు ఆహ్వానిస్తున్నారు. ఆక్రమణలు తొలగి వన్యప్రాణి సంరక్షణకు నూరు శాతం అనువైన పరిస్థితులు ఏర్పడతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఐటీడీఏ పీవోగా రాములు నాయక్ బాధ్యతల స్వీకరణ



బుట్టాయగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటరామచంద్రపురం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు ఆఫీసర్, ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్‌గా కె.రాములు నాయక్ శుక్రవారం బాధ్య తలు స్వీకరించారు. సుమారు ఆరు నెలలు తర్వాత ప్రభుత్వం ఐటీడీఏకు పూర్తిస్థాయి అధికారిగా ఈయనను నియమించింది. గతంలో పీవోగా పనిచేసిన ఎం.సూర్యతేజ గతేడాది జూలై 23న ఇక్కడ నుంచి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఎస్డీసీ జె.శ్రీనుకుమార్, జేసీ పి.ధాత్రిరెడ్డి ఇన్‌చార్జ్ పీవోలుగా పనిచేశారు. గతంలో రాములు నాయక్ ఏలూరులో విజిలెన్స్ ఎస్డీసీగా పనిచేశారు.

జిల్లాలో స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయండి : కలెక్టర్

ఏలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ అంకితభావంతో భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, మండల అధికారులతో శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇక ప్రతీ మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలన్నారు. పట్టణాలు, గ్రామాల మధ్య పరిశుభ్రతలో పోటీతత్వం పెంచాలని, ప్రతీ నెల ఉత్తమంగా నిలిచిన మండలానికి రోలింగ్ ట్రోఫీ అందిస్తామన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫినిష్ ఆంధ్రా!

ఘోరంగా విఫలమైన పథకం



ఏలూరులో ఫిష్ ఆంధ్రా స్టాల్

- అప్పట్లో వైసీపీ ప్రభుత్వం గొప్పలు
- సబ్సిడీ సొమ్మును జేబులో వేసుకున్న వైసీపీ నేతలు
- అప్పుల పాలైన నిర్వాహకులు

ఏలూరు టూటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను వ్యాపారవేత్తలను చేస్తామంటూ వైసీపీ ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. ఎంత ఆర్భాటంగా ప్రారంభించారో అంతే త్వరగా ఈ పథకం ఘోరంగా విఫలమైంది. ఫిష్ ఆంధ్రా పథకంలో యూనిట్‌లన్ని వైసీపీ నేతలకే మత్స్యశాఖాధికారులు కట్టబెట్టారు. ఫిష్ ఆంధ్రా స్టాల్స్ స్థాపించినట్లే స్థాపించి ప్రభుత్వ అధికారులు తనిఖీలు చేసిన తర్వాత మూసివేసి సబ్సిడీ సొమ్ము వారి ఖాతాల్లో వేసుకున్నారు. జిల్లాలో ఫిష్ ఆంధ్రా పథకం ద్వారా వైసీపీ నాయకులు 4కోట్ల 34లక్షల సబ్సిడీ నొక్కేశారు. ప్రభుత్వం ఈ పథకంలో 40 - 60 శాతం వరకు సబ్సిడీ ఇచ్చింది. 85 లక్షలతో జిల్లాలో ఒక ఆక్వాహబ్, రూ.75 వేల విలువ కలిగిన ఐస్‌బాక్సులతో మోటర్ సైకిళ్లు 16, రూ.3 లక్షల విలువైన చేపల అమ్మకపు ఆటోలు 6, రూ.20 లక్షల విలువైన చేపల రవాణా ఇన్సులేటెడ్ వాహనాలు 14, రూ.2లక్షల విలువతో ఏర్పాటు చేసిన చేపల దుకాణాలు 141, రూ.10 లక్షల విలువతో ఏర్పాటు చేసిన చేపల దుకాణాలు 12, రూ.20 లక్షల విలువతో ఏర్పాటు చేసిన లైవ్‌ఫిష్ దుకాణాలు రెండు, రూ.50 లక్షల విలువతో లాంజ్ రెస్టారెంట్లు 2, రూ.45 లక్షల విలువ కలిగిన సీడ్ స్టాకింగ్ పాయింట్లు 45 ప్రభుత్వం మంజూరు చేసింది. పైన పేర్కొవన్నీ జిల్లాలో ఎక్కడా కనిపించవు. కేవలం వైసీపీ నాయకులు సబ్సిడీ సొమ్ము జేబులో వేసుకునేందుకే ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని పెంచడానికి ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించే ఉద్దేశంతో ఆక్వాహబ్‌లు, రిటైల్ అవుట్‌లెట్ లను ఫిష్‌ఆంధ్రా పేరుతో ప్రారంభించారు. తాజా చేపలు, రొయ్యలు, పీతలు, ఎండుచేపలు, ఎండు రొయ్యలు, వండుకునేందుకు సిద్ధం చేసిన ఆక్వా ఉత్పత్తులు, పచ్చళ్లు, మొదలైనవి ఒకే చోట దొరికే విధంగా ఫిష్ ఆంధ్రా రిటైల్ అవుట్ లెట్‌లను ఏర్పాటు చేశారు. పట్టణ, గ్రామాల్లో కూడా అన్ని వేళల్లో ప్రజ లకు అందుబాటులో సరసమైన ధరలకు దొరికేలా ప్లాన్ చేశారు. జిల్లాలో రూ.80 లక్షలతో ఒక ఆక్వా హబ్‌ను ఏర్పాటు చేశారు. దీనికింద లాంజ్ మోడల్ షాప్ ఒకటి, ఐదు సూపర్ స్టోర్‌లు, 8 డైలీస్టోర్, రెండు మొబైల్ యూనిట్‌లు, పది ఈకార్టులు, గ్రామ, వార్డు స్థాయిలో మినీ అవుట్ లెట్‌స్టోర్స్ అనుసంధానించ బడతాయి. ఈ ఆక్వాహబ్‌లు మినీ రిటైల్ అవుట్‌లెట్ షాపులకు సరుకులు అందజేసేలా ఏర్పాటు చేశారు. ఆక్వాహబ్‌ను కలిదిండిలో ఏర్పాటు చేశారు. ఈ హబ్ నుంచి ఎవరికి ఆక్వా ఉత్పత్తులను సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. దీంతో మినీఫిష్ అవుట్ లెట్‌లు మూత పడ్డాయి. మినీఫిష్ అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేసిన లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయకుండా రూ.2లక్షల విలువైన సామగ్రి ఇచ్చింది. లైవ్‌ఫిష్ ట్యాంకు, ఫర్నీచర్, ఫ్రీజ్‌లు, వేయింగ్ మిషన్లు, బేషిన్లు, కటింగ్ టేబుళ్లు అందించారు. షాపునకు పెయింటింగ్ బోర్డులకు వైసీపీ రంగులు వేశారు. వాటికి అయ్యేఖర్చును లబ్ధిదా రుల నుంచి వసూలు చేశారు. ఆక్వాహబ్ నిర్వా హకు లు చిన్నషాపులకు సరుకు సరఫరా చేయక పోవడంతో బయట మార్కెట్ నుంచి తెచ్చుకుని అమ్మడం వల్ల నష్టాలు వస్తున్నాయి. దీంతో దాదాపు 80 శాతం షాపులు మూసివేశారు.

> **ఎంతో నష్టపోయాను..**
>
> రూ.రెండు లక్షలతో ఫిష్ అవుట్‌లెట్ ప్రారంభించాను. రూ.2 లక్షల విలువతో వైసీపీ ప్రభుత్వం కేవలం సామగ్రి అందజేసింది. ఒక్క రూపాయి ఇవ్వలేదు. ప్రభుత్వం ఇచ్చిన సామగ్రిలో చాలావరకు నిరుపయోగంగా ఉన్నాయి. షాపులకు వైసీపీ రంగులు వేసి మాదగ్గరే డబ్బులు వసూలు చేశారు. ఫిష్ ఆంధ్రా అని బోర్డులు పెట్టి ఆ బోర్డు వ్యయం మాపైనే వేశారు. ఈ పరికరాలన్నిటిని ప్రభుత్వం ఏజన్సీ ద్వారా సప్లై చేసింది. ఆ ఏజన్సీకి బ్యాంకులు డబ్బులు ముట్టజెప్పాయి. బ్యాంకుకు ఈఎంఐలు మేము కట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం షాపు నష్టాల్లో నడుస్తోంది.
>
> **- రవికాంత్, స్టాల్ నిర్వాహకుడు**


ఎంపీ మహేశ్‌కు ప్రతిపాదనలు అందిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్, జంగారెడ్డిగూడెం కమిషనర్ రమణ

చింతలపూడి, జంగారెడ్డిగూడెం అభివృద్ధిపై ఎంపీతో ఎమ్మెల్యే సమీక్ష

చింతలపూడి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం, చింతలపూడి మునిసిపాలిటీల అభివృద్ధిపై ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో ఎమ్మెల్యే రోషన్ సమీక్షించారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి మునిసిపాలిటీల అభివృద్ధికి రూ.200 కోట్లతో ప్రతిపాదనలు అందజేశారు. జంగారెడ్డిగూడెంలో భూగర్భ డ్రెయిన్, సెంట్రల్ లైటింగ్, పార్కుల ఏర్పాటు, చింతలపూడిలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వివరించారు. జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీని గ్రేడ్-1కు ప్రమోట్ చేయాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించి నిధులపై సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు. జంగారెడ్డిగూడెం డ్రెయిన్లకు రూ.80 కోట్లు, ఇతర పనులకు రూ.50 కోట్లు, చింతలపూడిలో రూ.42 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. సమీక్షలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి కమిషనర్లు కేవీ రమణ, పావని, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

తల్లిపై కుమారుడి హత్యాయత్నం

-3లో




సమావేశంలో పాల్గొన్న హెచ్‌ఎంలు, ఎంఈవోలు.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న నోడల్ ఆఫీసర్ సర్వేశ్వరరావు

మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రజావసరాలే ప్రామాణికం

- నేటి సాయంత్రంలోగా పంచాయతీల వారీగా ప్రతిపాదనలు ఖరారు చేయండి
- ఐదు పాఠశాలల విధానంపై క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈవోలకు వర్క్‌షాపు

ఏలూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన పంచాయతీ కో మోడల్ ప్రైమరీ స్కూలు ఏర్పాటుకు సంబంధిత క్లస్టర్‌లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, పాఠశాలలో మౌలిక సదు పాయాలు, ప్రజావసరాలే ప్రామాణికమని కొత్త పాఠశాల ల విధానం జిల్లా నోడల్ ఆఫీసర్ సర్వేశ్వర రావు స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈవోలతో ఏలూరులోని సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో నిర్వహించిన వర్క్‌ షాపులో నూతన విధానం అమలుపై పాటించాల్సిన విధి విధానాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. పాఠశాలవిద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (కాకినాడ ఆర్జేడీ) నాగమణి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్ తదితరులు ఈ వర్క్ షాపునకు హాజరయ్యారు. నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ గతేడాది డిసెంబరు 31వ తేదీ నాటి ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రామాణికంగా తీసు కుని మండలాల వారీగా అన్ని పంచాయతీ ల్లో ఏర్పాటయ్యే కొత్త స్కూళ్లపై శనివారం సాయంత్రంనాటికి ఎంఈవోలు తుది నివేదికలను సిద్ధం చేయాలని, వీటిపై ఆది, సోమవారాల్లో జిల్లాస్థాయి కమిటీ పరిశీలన చేస్తుందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని డివిజన్ల విద్యాధికారులు, క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈవోలతో పాఠశాల విద్య డైరెక్టర్ విజయ రామరాజు ఈ నెల 21న ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో సమీక్షించి తుదిరూపునిస్తారని పేర్కొన్నారు. నిర్ణీత సంఖ్య కంటే తక్కువగా విద్యార్థులున్నచోట ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఐదు రకాల పాఠశాలలకు సంబంధించి నమూనా ప్రణాళికను కొయ్యలగూడెం, పెదపాడు, లింగపాలెం మండలాలకు వర్క్‌షాపులో రూపొందించి శుక్రవారం ప్రభుత్వానికి పంపించారు. హెచ్‌ఎంలు, ఎంఈవోల సందేహాలను నివృత్తి చేశారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.




ఆంధ్ర-ఢిల్లీ మధ్య హోరాహోరీగా పోటీ.. క్రీడాకారులతో డీఎస్పీ శ్రీవేద దంపతులు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

నరసాపురం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో జరు గుతున్న జాతీయస్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. సెమీఫైనల్స్‌లో చోటు దక్కించుకునేందుకు బరిలో ఇరు జట్లు మెరుగైన ఆట తీరు ప్రదర్శించాయి. దీంతో నాల్గోరోజు పోటీలు ఆసక్తికరంగా మారింది. అన్ని మ్యాచ్‌లకు స్టేడియంలో కూర్చున్న ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. ఆంధ్రా జట్లు ఆడినప్పుడల్లా వారికి మద్దతుగా నిలిచి హర్షధ్వానాలు చేశారు. ఇప్పటివరకు జరిగిన పురుషుల విభాగంలో సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ, ఆంధ్ర, నవీన్ యూపీ, మహిళల్లో సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ, రాజస్థాన్, కేరళ జట్లు ముందంజలో ఉన్నాయి. ఆంధ్రా- ఢిల్లీల మధ్య సాగిన పోటీ హోరాహోరీగా సాగింది. పురుషుల విభాగంలో ఉదయం జరిగిన పోటీల్లో ఢిల్లీని 20 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. వెస్ట్ బెంగాల్‌ను మహారాష్ట్ర జట్టు 15 పాయింట్ల తోనూ, జమ్ముకాశ్మీర్‌ను కోల్‌కతా జట్టు 30 పాయింట్ల తేడాతో ఒడించింది. మహిళా విభాగంలో పటియాలాను కోల్‌కతా జట్టు 22 పాయింట్లు, మరో మ్యాచ్‌లో పటియాలాను ఢిల్లీ జట్టు 29 పాయింట్ల తేడాతో ఓడించింది.

నేడు ఫైనల్స్

శనివారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగిన ఈ పోటీల్లో పాయింట్ల ఆధారంగా ముందంజలో ఉన్న జట్లను ఉదయం సెమీస్‌లో ఆడించనున్నారు. రాత్రి ఫైనల్స్ జరగనున్నాయి. విజేతలకు కమిటీ తరుపున షీల్డ్‌తో పాటు రూ.7 లక్షలు ప్రైజ్‌మనీ ఇవ్వను న్నారు. ఇందులో మొదటి జట్టుకు రూ.1.50 లక్షలు, రెండోస్థానంలో రూ.లక్ష, తృతీయ రూ.75 వేలు, నాల్గోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేలు నగదు అందించనున్నారు.పోటీలకు జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీంలు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. పోటీల కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, వీరలంకయ్య, పద్మజా బాల, కమిటీ సభ్యులు వలవల ప్రసాద్, బాబులు, గోపి, మమ్ము, గంధం రవి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు



అత్తిలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : యోగి వేమన శత జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు రెండవ రోజైన శుక్రవారం జరిగాయి. ఈ పోటీలలో ఆరవల్లి యోగివేమన, అత్తిలి, కేశవరం, కొత్తపల్లి, కొణితివాడ, జల్లికాకినాడ, గణపవరం, ఆరవల్లి -బి జట్లు పాల్గొన్నాయి. మహిళా కబడ్డీ పోటీలలో శుక్రవారం ఆరు మ్యాచ్‌లు జరిగాయి. జంగారెడ్డిగూడెం పీఎం లంక మధ్య జరిగిన పోటీలలో జంగారెడ్డిగూడెం జట్టు విజయం సాధించింది. తణుకు - ఉండి జట్ల మ్యాచ్‌లో ఉండి -కాల్దారి- తణుకు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తణుకు జట్టు, అనంతపల్లి - జంగారెడ్డిగూడెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జంగారెడ్డిగూడెం, తణుకు - పీఎం లంక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పీఎం లంక విజయం సాధించిందని జిల్లా మహిళా కబడ్డీ సెక్రటరీ వై శ్రీకాంత్ తెలిపారు.



రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేతలకు ప్రథమ బహుమతి అందిస్తున్న ఆహ్వాన సంఘం నాయకులు డాక్టర్ ప్రతాప్‌కుమార్

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలో విజేత అయి-భీమవరం జట్టు

ఆకివీడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) :ఆకివీడులో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు ముగిశాయి. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 42వ సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో చీరాల జట్టుపై అయి-భీమవరం జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈనెల 15 నుంచి చెడుగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. డీవైఎఫ్‌ఐ ప్రతీ ఏటా సంప్రదాయ క్రీడలు నిర్వహించడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్, అధ్యక్షుడు ఎండీ మదనీ ఉన్నారు.

తెలుగుకీర్తి జాతీయ పురస్కారానికి శ్రీహరికోటి ఎంపిక



ఏలూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త సకల కళాకారుల సంక్షేమ సంఘం ఏలూరు మండల అధ్యక్షుడు శ్రీహరికోటి తెలుగుకీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఏలూరుకు చెందిన ఆయన నాలుగున్నర దశాబ్దాలుగా సంగీత సాహిత్య రంగాల్లో రాణిస్తున్నారు. అనేక సాహిత్య పురస్కారాలతో పాటు వందలాది సన్మానాలు, సత్కారాలు పొందారు. తెలుగు భాష, సంస్కృతి, కళల పట్ల ఆయన చేసిన కృషికి శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన తెలు గుకీర్తి జాతీయ పురస్కారం అందు కోనున్నారు. శ్రీశ్రీ కళావేదిక వ్యవ స్థాపకుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి తదితరులు హర్షం ప్రకటించారు.

మొగల్తూరులో సుగర్ వ్యాధి హాస్పటల్ ఏర్పాటు చేస్తాం

కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి



కృష్ణంరాజు సతీమణికి స్వాగతం పలుకుతున్న రమేష్‌నాయుడు

భీమవరం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో దివంగత కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు, సూర్య నారాయణరాజు పేరిట సుగర్ వ్యాధి ఆసుపత్రిని ప్రారంభి స్తామని కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తెలిపారు. భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డులోని ఉండపల్లి కాంప్లెక్స్‌లో చిరు పవన్ తేజం సేవాసంస్థ అధ్యక్షుడు, జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు నివాసంలో శుక్రవారం మాట్లాడారు. ఇందులో భాగంగా ఈనెల 20 న భీమవరం డీఎన్నార్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో యూకే-ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉప్పలపాటి వెంకట కృష్ణం రాజు మెమోరియల్ ఉచిత మెగా సుగర్ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. లండన్ వైద్యులు డాక్టర్ వేణు ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించనున్నారు.ఉండపల్లి రమేష్ నాయుడు, పద్మ, వెంకటేశ్వర్లు రాజు, జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఉండి వాసు, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, అల్లూరి సూర్య నారాయణరాజు, వైద్యులు పాల్గొన్నారు. ముందుగా మావుళ్ళమ్మని దర్శించుకుని పూజలు చేశారు.

ఖర్మభూమిలో పుట్టడం మన పూర్వజన్మ సుకృతం

గణపతి సచ్చిదానంద స్వామి



కాళ్ళ గ్రామంలోని దత్త పాదుకా క్షేత్రంలో అభిభాషిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

ఆకివీడు/ కాళ్ళ జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ఖర్మభూమి అని ఇక్కడ పుట్టడం మన పూర్వజన్మ సుకృతమని గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. శుక్రవారం ఆకివీడు దత్తక్షేత్రంలో దత్తుడు, పంచముఖ ఆంజనేయ స్వామి, అనఘాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు జ్ఞానబోధ చేశారు. కుంభమేళలో నాగసాధులు చేసిన నీళ్ళలో మనం స్నానాలు చేస్తే పాపాలు పోతాయన్నారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలన్నారు. పిల్లలకు భగవద్గీత నేర్పించాలన్నారు. శనివారం దత్తక్షేత్రంలో విశ్వాంబర రాగసాగర ఉందని దానిని అందరూ తిలకించాలన్నారు. కార్యక్రమంలో విజయానంద తీర్థ స్వామి, ట్రస్టీ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.. విశ్వ ధర్మ విజయయాత్రలో భాగంగా క్షేత్రయాత్ర నిర్వహిస్తున్న సచ్చిదానంద స్వామి జీ శుక్రవారం సాయంత్రం కాళ్ళ గ్రామంలోని దత్త పాదుకా క్షేత్రానికి విచ్చేశారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన సుమారు 200 మందికి పైగా మహిళలతో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భక్తులకు ధర్మప్రవచనాలను బోధించారు. ధర్మాన్ని రక్షించడానికి హిందూమతం పుట్టిందని స్వామిజీ అన్నారు. దత్త పాదుకా క్షేత్రం వలంటీర్లు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, గోళ్ళ నాగేశ్వరరావు, పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యో..వేమా !

- యోగి వేమనను విస్మరించిన పాలకులు
- కర్ణాటకలో అధికారికంగా జయంత్యుత్సవాలు
- సొంత రాష్ట్రంలో లేని గుర్తింపు

అత్తిలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : యోగి వేమన పద్యాల గురించి తెలియని వారుండరు. అందరికీ అర్థమయ్యే రీతిలో వేలాది పద్యాలు రాశారు. సమాజంలో అంటరానితనం, కుల మత బేధాలను రూపుమాపారు. మానవత్వం, సామాజిక బాధ్యత తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల్లో చైతన్యం నింపారు. అలాంటి ప్రజా కవికి సొంత రాష్ట్రంలోనే సరైన గుర్తింపు లేదు. ఆ మహాకవి జయంతిని పాలకులు నేటికీ నిర్లక్ష్యం చేస్తున్నారు. అయితే యోగి వేమనలో ప్రతి భను సంఘ సంస్కర్తను గుర్తించిన పొరుగు రాష్ట్రమైన కర్ణాటక ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ తెలుగు కవిని పాలకులు పూర్తిగా మర్చిపోయారు. ఆయన గుంటూరు జిల్లా కొండవీడు సమీపంలోని మోగచింతలపల్లిలో 14వ శతాబ్దంలో జన్మించారు. తెలుగు భాషకు వన్నె తెచ్చిన ప్రజా కవి. ఆయన రచించిన పద్యాలను ప్రముఖ ఆంగ్ల కవి సీపీ బ్రౌన్ ఇంగ్లీషులోకి అనువదించారు. కడప జిల్లా కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట మండలంలోని కటారిపల్లిలో జీవసమాధి అయ్యారు. ఈ సమాధిని దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తూ ఉంటారు. అదే విధంగా పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నియోజకవర్గంలోని అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో జనవరి 18వ తేదీన యోగి వేమన జయంతి ఉత్సవాలు 99 సంవత్సరాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనేది తెలుగు భాషా కవుల, ప్రేమికుల చిరకాల కోరిక. గత ప్రభుత్వ హయాంలో వేమన జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించారు. నాటి పర్యాటకశాఖ మంత్రి వేమన జయంతి ఉత్సవాలను అధికారికంగా ప్రకటించి 2023లో నిర్వహించారు. 2024లో నిర్వహించలేదు. తెలుగు భాషను మరిచిపోయే నేటి బాలలకు, పౌరులకు తెలుగు ఆవశ్యకతను తెలియజేసేందుకు, వేమ రాసిన పద్యాలను ఒక్క రోజైనా స్మరించుకునేందుకు ఈ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని తెలుగు భాషా ప్రేమికులు కోరుతున్నారు.



ఆరవల్లిలో యోగి వేమన విగ్రహం

ఆరవల్లిలో నేడు శత జయంతి ఉత్సవాలు



ఆరవల్లిలోని వేమన ఆలయానికి అలంకరణ

ఆరవల్లి ప్రజల ఆరాధ్యదైవం యోగి వేమన 100వ జయంతి ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. వేమన జయంతి ఉత్సవాలు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సాధారణంగా సంక్రాంతి వచ్చిందంటే గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. కానీ ఆరవల్లి వాసులకు జనవరి 18న నిర్వహించే వేమన జయంతే పెద్ద పండుగ. దేశ విదేశాలకు వెళ్ళినవారు. వృత్తి, ఉపాధిరీత్యా బయట ప్రాంతాలకు వెళ్లిన వారు వేమన జయంతి రోజున తప్పకుండా స్వగ్రామానికి చేరుకుంటారు. ఈ రోజున మహిళలు, పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ గ్రామానికి చారిత్రకంగా ఎలాంటి సంబంధం లేకపోయినా ఆరవల్లి గ్రామ ప్రజలకు వేమన ఆరాధ్య దైవమయ్యారు. దీనిపై గ్రామస్తులు ఆసక్తికరమైన విషయం చెబుతారు. 1926కు ముందు గ్రామంలో ఏటా అగ్ని ప్రమాదాలు సంభవించేవి. అలాంటి పరిస్థితుల్లో గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి (దాసు) 1926 జనవరి 18న గ్రామంలో వేమన చిత్రపటాన్ని తాటాకు పందిరిలో ఉంచి పూజలు చేయడం ప్రారంభించారు. ఇలా చేయడంతో గ్రామంలో అగ్ని ప్రమాదాలు తగ్గిపోయాయట. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 18న వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన యువత యోగి వేమన రెడ్డి యువజన సేవా సంఘాన్ని నెలకొల్పి సేవా, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

శునకాలకు అన్నదానం

వేమన జయంతి ఉత్సవాల్లో భాగంగా జనవరి 18న ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నసమారాధ నిర్వహిస్తారు. మనుషులకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామ సింహాలైన శునకాలకు విస్తరాకుల్లో ఆహార పదార్థాలను వడ్డించడం విశేషం. గ్రామానికి కాపలా ఉంటూ, గ్రామాన్ని రక్షించేది కాలభైరవుడని, ప్రతి ఏటా గ్రామంలో కాలభైరవ సంతర్పణ పేరుతో గ్రామంలో ఉన్న శునకాలకు భోజనం వడ్డిస్తామని యోగివేమన జయంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ వెలగల అమ్మిరెడ్డి తెలిపారు.

ఆరోగ్య సేవలకు జాతీయ పురస్కారం

ఐదు ఏజెన్సీ మండలాల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి గత కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ చొరవ

'అక్షజ' కార్యక్రమం ద్వారా సేవలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లాకు అవార్డు అందజేత ?



ఏలూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో భాగంగా జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో రక్తహీనత వున్న గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసి సత్ఫలితాలు సాధించినందుకు ప్రధానమంత్రి పురస్కారం (ప్రైమ్ మినిస్టర్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినేస్ట్రేషన్-2023)కి ఏలూరు జిల్లాను కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ పథకాల అమలును వినూత్నంగాచేసి, ప్రజాపాలనలో ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి ఈ అవార్డును ప్రకటిస్తారు. వివిధ అంశాల్లో జాతీయస్థాయి పురస్కారాలకు దేశ వ్యాప్తంగా మొత్తం 16 జిల్లాలను కేంద్రం ఎంపికచేయగా అందులో ఆరోగ్యపథకాలకుగాను ఏలూరు జిల్లా ఎంపికైంది. ఆ ప్రకారం 2021 ఏప్రిల్ నుంచి ఆయా రంగాల్లో జరిగిన అభివృద్ధిని మదింపుచేయడానికి ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బృందం ఐదునెలల క్రితం జిల్లాను సందర్శించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్‌ల సమన్వయంతో ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల న్యూట్రిషన్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ పద్మజ నేతృత్వంలో తయారుచేస్తోన్న పోషక విలువలతో కూడిన పౌడర్‌ను వినియోగించి లడ్డూలను ఏజెన్సీలోని ఐదు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలద్వారా గర్భిణులు, బాలింతలకు ఇస్తుండటాన్ని బృందంలోని సభ్యులు పరిశీలించారు. మునగాకు, ఇతర మిల్లెట్స్‌ను వినియోగించి తయారుచేసిన ఈ పౌడర్‌ను లడ్డూల తయారీకి వాడుతున్నారు. దీనినే కళాశాల న్యూట్రిషన్ విభాగం ద్వారా పైలెట్ ప్రాజెక్టుగా కృష్ణా జిల్లాకు కొన్ని నెలలపాటు సరఫరా చేశారు. ఏలూరు జిల్లాకు సంబంధించి పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో రక్తహీనత సమస్యను గర్భిణులు, బాలింతలు ఎదుర్కొంటున్నట్టు గమనించారు. సామాజిక బాధ్యతగా పూర్వపు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ 'అక్షజ' అనే కార్యక్రమం ద్వారా వీరికి రోజూ పోషక విలువలతో కూడిన పౌడర్‌తో తయారు చేసిన లడ్డూలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చి అక్కడికక్కడే తినిపించేవారు. ఈ లడ్డూలను తినడం ద్వారా రక్తహీనత సమస్య నుంచి బయటపడినట్టు గుర్తించారు. మరోవైపు ఏజెన్సీ మండలాల్లో గర్భిణులు, బాలింతల కోసం జాతీయ ఆరోగ్య పథకాలైన ప్రదానమంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై), ఉచిత వైద్యచికిత్సలకు ఉద్దేశించిన ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన (పీఎంజేఏవై), పిల్లల వ్యాక్సినేషన్ కోసం నిర్దేశించిన మిషన్ ఇంద్రధనస్సు పథకాలను జిల్లాలో విజయవంతంగా అమలుచేయడానికి పూర్వపు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేపట్టిన వినూత్న వ్యూహం సత్ఫలి తాలనే ఇచ్చినట్టు కేంద్ర బృందం ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో భాగంగా ఏజెన్సీ మండలాల్లో మొత్తం 2 వేలమంది జాతీయ ఆరోగ్యపథకాల లబ్ధిదారులతో కేంద్ర బృందాలు నేరుగా, ఐవీఆర్‌ఎస్ పద్ధతిన మాట్లాడి నిర్ధారణకు వచ్చాయి. పూర్వపు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ జిల్లా తరపున పైలట్ ప్రాజెక్టును ఏజెన్సీ మండలాల్లో అమలు చేయడానికి ఐసీడీఎస్‌ను సమన్వయం చేసుకుని పనిచేశారు. ఈ నేపథ్యంలో సమష్టి కృషితో జిల్లాకు ప్రధాన మంత్రి పురస్కారం దక్కింది. కాగా ఈ నెల 26న ఈ పురస్కారం అందజేసే అవకాశం ఉంది.

అధ్యాపకుల కృషి అభినందనీయం

సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ

ఏలూరు జిల్లాకు ప్రధానమంత్రి పురస్కారం రావడం గర్వకారణమని ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు.శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లాకు పీఎం పురస్కారం రావడంలో తమ కళాశాల న్యూట్రిషన్ విభాగం అధ్యాపకులను అభినందించారు. గిరిజన మండలాలైన బుట్టాయి గూడెం, టి.నరసాపురం, జీలుగుమిల్లిలో పోషకాహార లోపంతో వున్న ఆరేళ్ళలోపు పిల్లలు 999 మంది, రక్తహీనతతో బాధపడుతున్న 232 మంది గర్భిణులకు మునగాకు, మిల్లెట్స్‌లో తయారుచేసిన లడ్డూ లను ఇవ్వగా పిల్లల్లో బరువు, ఎత్తు పెరగగా, గర్భిణుల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగినట్టు వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టును 2023 అక్టోబరు నుంచి గతేడాది మార్చి నెలవరకు కొన సాగించగా మంచి ఫలితాలు వచ్చాయ న్నారు. 'అక్షజ' పేరిట చేపట్టిన ప్రాజెక్టులో కళాశాల న్యూట్రిషన్ విభాగం అధ్యాపకులు డాక్టర్ జ్యోతికుమారి, డాక్టర్ పద్మజ పరిశోధన, డేటా ఎనాలసిస్‌లలో ప్రావీణ్యంతో అతి చౌకగా రూపొందించిన పోషకాహారం సత్ఫలితాలు సాధించిందన్నారు. కళాశాల సుపీరియర్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, పరీక్షల కంట్రోలర్ సిస్టర్ సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.



న్యూట్రిషన్ విభాగం అధ్యాపకులతో ప్రిన్సిపాల్



జనార్ధనవరంలో విరబూసిన మామిడి పూత

మామిడి పూత అదిరింది..

దిగుబడులకు సూచనలు

చాట్రాయి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలో పూత బావుండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. ఈ ఏడాది 15 రోజులు ముందుగానే పూతలు బాగా రావడంతో కాపు సంతృప్తికరంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. మామిడి పంటకు చాట్రాయి మండలం బాగా ప్రసిద్ధి. ఇక్కడ పండే మామిడి పండ్లకు దేశంలోని అన్ని మార్కెట్లలో మంచి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. దిగుబడులు రావటానికి అనుసరించవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి ఉద్యానశాఖ అధికారి పలు సూచనలు చేశారు. పూత అధికంగా రాలుతున్నట్లైతే 1 మిల్లీలీటరు నాఫ్తలిన్ ఎసిటిక్ ఆమ్లం 20 పీపీఎం, లేదా ప్లానోఫిక్స్ 1 మిల్లీ లీటరును 4.5 లీటర్ల నీటిలో కలిపి బఠానీ సైజు నిమ్మకాయ సైజులో ఉన్న పిందెలపై పిచికారి చేయాలన్నారు. తేనె మంచు పురుగు నివారణకు 1500 పీపీఎం 3 మిల్లీ లీటర్లు, లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటరు, లేదా క్లోరోఫైరిపాస్ 20 ఈసి 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలన్నారు.

ఈ మొక్కలతో జీవ మనుగడకు నష్టం

కోనో కార్పస్‌తో శ్వాస కోశ వ్యాధులు

పర్యావరణానికి హాని



కొండంగి-అమరావతి ప్రధాన రహదారి పక్కన పెరిగిన కోనోకార్పస్ మొక్కలు

కలిదిండి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటారు. కానీ అన్ని రకాల మొక్కలు కాదు..ఇందులో కొన్ని మానవ మనుగడకు, పర్యావరణానికి హాని కలిగిస్తాయి. అలాంటి కోవకు చెందిన మొక్కలే కోనోకార్పస్..ఈ విషయాన్ని పలు పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. ఇలాంటి మొక్కలు ప్రపంచంలో చాలా దేశాలు నిషేధించాయి. రాష్ట్రం సరిహద్దున ఉన్న తెలంగాణ లోనూ నిషేధం ఉంది. కానీ కైకలూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రహదారుల పక్కన ఈ మొక్కలను విస్తారంగా ఉన్నాయి. చూడటానికి పచ్చగా అందంగా త్వరగా పెరిగే స్వభావం కలిగి ఉండటం...పశువులు తినేందుకు మక్కువ చూపకపోవడం, పక్షులు సైతం వాలకపోవటం వంటి కారణాలతో ఈ మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటి పువ్వుల నుంచి వెలువడే పుప్పొడి వల్ల శ్వాస కోశ వ్యాధులు కలుగుతాయి. వీటి వేర్లు వల్ల భూమిలోని కేబుళ్లు, తాగునీరు, డ్రైనేజీ పైపులు ధ్వంసమవుతాయి. ఇలా ఈ మొక్కలతో ఉపయోగం లేకపోగా అనేక దుష్ప్రభావాలు కలుగచేస్తుందని వృక్ష శాస్త్రవేత్తలు నిర్ధారించారు. కలిదిండి మండలంలో పలు గ్రామాల్లో రహదారుల పక్కన ఈ మొక్కలను సుందరీకరణకు వినియోగిస్తున్నారు. ఇటీవల ఈ మొక్కల వల్ల విద్యార్థుల ఆరోగ్యానికి హాని కలుగుతుందని భాస్కరావుపేట, పెదలంక జడ్పీ హైస్కూళ్లలో కోనోకార్పస్ మొక్కలను తొలగించారు. కలిదిండిలో పాతాళ భోగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ఉన్న కోనోకార్పస్ చెట్లను నరికివేశారు. ఈ చెట్ల వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని శ్వాసకోస వ్యాధులు ఆస్తమా, అలర్జీ వ్యాధుల బారిన పడుతున్నట్లు పరిశోధనలో తేలింది. సంబంధిత అధికారులు స్పందించి పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ, ప్రజలకు అనారోగ్యాన్ని కలిగించే కోనోకార్పస్ చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పందెంకోడిని దక్కించుకున్న మాగంటి నవీన చంద్రబోస్‌కు దాన్ని అందిస్తున్న హోటల్ యజమానులు

పందెంకోడి @ రూ.1,11,111


ఏలూరు రూరల్, జనవరి 17, ఆంధ్రజ్యోతి): బరిలో హోరాహోరీగా సాగిన పందెంలో వీరమరణం పొందిన పందెం పుంజును వేలంపాట వేశారు ఏలూరుకు చెందిన హోటల్ యజమానులు ఇష్టంగా పెంచుకున్న పుంజు గొప్పదనాన్ని చాటేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆ పుంజును దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. ఏలూరు నరశింహరావు పేటలోని ఓహోటల్‌లో వినూత్నంగా పందెంకోడి వేలం పాట నిర్వహించారు. వేలంపాటలో పందెం కోడి పుంజును దక్కించు కునేందుకు అనేకమంది పోటీపడ్డారు. దీంతో ఆ పాట రూ.లక్షకు పైగా చేరుకుంది. మాగంటి నవీన్ చంద్రబోస్ లక్షా 11 వేల 111 రూపాయలకు పందెం కోడిని దక్కించుకున్నారు. హోటల్ యాజమానులు కొండ్రెడ్డి రాజేంద్ర, వంకినేని అహ్లాద్, వంకినేని రాజవంశీలు చంద్రబోస్‌కు ఈ పందెంకోడిని అందించారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు వంకినేని కృష్ణమోహన్, వీరమాచినేని విజయ్, పెనుమత్స పద్మనాభశర్మ పాల్గొన్నారు.



ఢిల్లీలో గైడ్ టీచర్ కృష్ణప్రసాద్‌తో విద్యార్థి సువార్తరాజు

ప్రధాని చర్చాగోష్టిలో నిడమర్రు విద్యార్థి

నిడమర్రు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధా నమంత్రి మోదీ విద్యార్థులతో నిర్వహించిన జాతీయ చర్చా సదస్సుకు నిడమర్రు హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి పతి వాడ రాకాడ సువార్తరాజు పాల్గొన్నట్లు పాఠశాల హెచ్‌ఎం బి.రాజేశ్వరి తెలియజేశారు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈ నెల 14న జరిగిన కార్యక్రమంలో శారీరక మానసిక అభివృద్ధిలో ఆహారం పాత్ర అనే అంశంపై విద్యార్థులతో చర్చాగోష్టి నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తరుపున మొత్తం ఆరుగురు విద్యార్థులు ఎంపికవ్వగా వారిలో సువార్తరాజు ఒకరు.



నృత్య సమ్మోహనం

మావుళ్లమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ నృత్యంలో ఆహూతులను అలరించారు

ప్రయాణికులు లేక చర్లపల్లి రైలు వెలవెల



ఏలూరులో ఖాళీగా ఉన్న రైలు

ఏలూరు క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా రైల్వేశాఖ ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఏర్పాటు చేసిన రైలు ప్రయాణికులు లేక శుక్రవారం ఖాళీగా వెళ్ళిపోయింది. ప్రత్యేక రైళ్ళను విశాఖపట్నం నుంచి చర్లపల్లి, సికింద్రాబాద్‌కు కాకినాడ పోర్టు నుంచి సికింద్రాబాద్‌కు, చర్లపల్లికి ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీ లేకపోవడంతో ఆ రైళ్ళల్లో రిజర్వేషన్ చేయించుకోకపోవడంతో కొన్ని రైళ్ళను రద్దు చేశారు. మళ్ళీ ప్రయాణికుల రద్దీ ఉందని భావించి వెంటనే ఈనెల 15వ తేదీన రైల్ నెంబర్ 085 22 విశాఖపట్నం నుంచి చర్లపల్లి వరకు జన సాధన ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. ఈ రైలులో ప్రయాణికులు టిక్కెట్ తీసుకుని ఎక్కవచ్చు. ఎలాంటి రిజర్వేషన్ ఉండదు. ఈ ప్రత్యేక రైలు శుక్రవారం ఉదయం విశాఖపట్నంలో 9.45 గంటలకు బయలుదేరింది. ఏలూరునకు శుక్రవారం మధ్యాహ్నం 2.25 గంటలకు రావాల్సి ఉండగా 3 గంటలకు వచ్చింది. కానీ ఈ రైలు ప్రారంభం నుంచి కూడా ప్రయాణికులు లేకపోవడంతో భోగీలో ఒకరిద్దరు మాత్రమే కనిపించారు. ఏలూరు మీదుగా ఈ రైలు విజయవాడకు వెళ్ళిపోయింది. చర్లపల్లికి రాత్రి 10.30 గంటలకు చేరుకుంటుంది.

రేపు నరసాపురం నుంచి ప్రత్యేక రైలు

నరసాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకుని ఆదివారం నరసాపురం నుంచి చర్లపల్లికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఎస్ఎం మధుబాబు చెప్పారు. ఈ రైలు నరసాపురంలో రాత్రి 9గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లికి వెళుతుందన్నారు. పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, ఖమ్మం, వరంగల్ మీదుగా చర్లపల్లి వెళుతుందన్నారు.

నేడు జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష

ఏలూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు శనివారం పరీక్ష జరుగనుంది. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, భీమడోలు, మండవల్లి, కైకలూరు, చింతలపూడిలలో ఏర్పాటు చేసిన 13 కేంద్రాల్లో మొత్తం 3148మంది బాలబాలికలు ప్రవేశ పరీక్షకు దరఖాస్తుచేసుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా స్థానికంగా ఉండే డిప్యూటీ తహసీల్దార్లను పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ ప్రవేశపరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు హాల్‌టిక్కెట్‌తోసహా ఉదయం 10గంటలకే చేరుకోవాలని, ఉదయం 11.30 తర్వాత ఎవరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులు వారికిచ్చిన ఓఎంఆర్ తమకు సంబంధించిందో, కాదో ముందుగా సరిచూసుకున్న తర్వాతే నిర్దేశించినచోట సంతకం చేయాలని సూచించారు. బ్లాక్ లేదా బ్లూ కలర్ బాల్ పాయింట్ పెన్‌తో మాత్రమే జవాబులను బబుల్‌చేయాలని కోరారు. అభ్యంతరకరమైన ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షకేంద్రంలోకి అనుమతించబోమని, ఇటువంటి వస్తువులతో ఎవరైనా పట్టుబడితే పరీక్షకు సంబంధిత విద్యార్థిని అనర్హులుగా చేస్తామని హెచ్చరించారు. పరీక్ష నిర్వహణలో సందేహాల నివృత్తికి డీఈవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ నెంబర్లు 63030 39477, 94907 28768, 96406 76608, 90785 68664, 80748 33690, 94917 31486లలో సంప్రదించాలని కోరారు.

వైసీపీ కార్యకర్త హల్‌చల్

ఎమ్మెల్యే ఆరిమిల్లి కారుకు దారివ్వని ఆటో

పోలీసులకు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి ఫిర్యాదు

తణుకు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణపై గతంలో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంతో పాటు శుక్రవారం ప్రత్యక్షంగా వ్యక్తిగత దూషణలకు దిగిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త పంజా దుర్గారావుపై పట్టణ పోలీసులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి వ్యక్తిగత కార్యదర్శి ముత్యాల మోహన్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని వివరాలు ప్రకారం శుక్రవారం ఉదయం తమ పార్టీ కార్యాలయం నుంచి కారులో ఎమ్మెల్యే ఆరిమిల్లి, గన్‌మెన్ గుడాల శివరామ్, డ్రైవర్ తులా సతీష్‌తో కలసి వేల్పూరు బయలు దేరినట్లు చెప్పారు. పట్టణంలో తమ వాహనానికి ముందు వెళ్తున్న ఆటో తరచూ అడ్డు వస్తున్నది. ఆటో నడుపుతున్న వ్యక్తి చెయ్యి చూపిస్తూ కారును అడ్డుకున్నాడు. తనతో పాటు గన్‌మెన్, డ్రైవర్ కిందకు దిగి అడ్డు తప్పుకోమని అడగ్గా, తాను వైసీపీ కార్యకర్తనని, తన పేరు పంజా దుర్గారావు అని చెప్పుకొచ్చాడు. తన వెనుక మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఉన్నారని, మీ మీద సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నానంటూ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను దూషణలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించాడు. ఎవ్వరైనా తనజోలికి వస్తే గన్‌తో చంపుతానని, ఎంతకైనా తెగిస్తానంటూ దుర్గారావు బెదిరించినట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి మోహన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కాన్వాయ్ వెనుక ఉన్న ప్రముఖులు మారుతీరావు, రాంబాబు, గమిని రాము వచ్చి సర్ధిచెప్పడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేదన్నారు. ఇంతలో ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ వచ్చి పంజా దుర్గారావును స్టేషన్‌కు తరలించారు. దుర్గారావు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, వంగలపూడి అనిత, ఆరిమిల్లి రాధాకృష్ణపై అసభ్యకర పోస్టులు పెట్టాడు. దీనిపై గత నవంబరు నెలలో పోలీసులకు ఫిర్యాదు వెళ్ళింది. ఈఘటనపై మాజీ మంత్రి కారుమూరి స్పందిస్తూ సామాన్య కార్యకర్త దుర్గారావుపై దూషణలు చేస్తూ, దిగిజారే విధంగా టీడీపీ వారు వ్యవహరించారని ఆరోపించారు.

విశాఖ ఉక్కును కాపాడతామనే హామీ నిలబెట్టుకున్నాం



కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినా దానికి జీవం పోస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూ. 11,400కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ని ప్రకటించిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. తాను కేంద్ర ఉక్కు సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి మార్గదర్శకంలో విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుతామనే హామీని నెరవేర్చడానికి నిరంతరం కృషి చేస్తూనే వచ్చానన్నారు. అందులో భాగంగా బాధ్యతలు చేపట్టిన నెలరోజుల వ్యవధిలోనే కేంద్రమంత్రి కుమార స్వామితో కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి ఆర్థిక, కార్మిక సమస్యలపైన అధికారులతోను, కార్మిక సంఘాల నాయకులతో చర్చించామన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి కలిగిన నరేంద్ర మోదీ ప్రభుత్వం కాలయాపన చేయకుండా కేవలం నెలల వ్యవధిలోనే నేడు ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం ద్వారా ఎన్నో ఏళ్లుగా కార్మికులు పడుతున్న ఇబ్బందులు తీరిపోయి, విశాఖ ఉక్కు కర్మాగారం పూర్వ వైభవ స్థితికి చేరుకొని లాభాల బాటలో పయనిస్తుందన్నారు.

తిరగబడిన ఆటో: ఒకరికి గాయాలు



ముదినేపల్లి వద్ద బోల్తా పడిన ఆటో

ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో గురజ గ్రామానికి చెందిన తొందూరు నాగరాజు తీవ్ర గాయాలకు గురయ్యాడు. మచిలీపట్నం నుంచి గురజ గ్రామంలోని చేపల చెరువుల వద్దకు మేత కట్టలు తీసుకొచ్చిన ఆటో తిరిగి ముదినేపల్లి నుంచి మచిలీపట్నం వెళ్తుండగా, జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న గోతుల్లో బోల్తా పడింది. ముదినేపల్లిలో ఆటో ముగ్గురు ఎక్కగా వారిలో నాగరాజు అనే వ్యక్తి ప్రమాదంలో గాయాలకు గురయ్యాడు. వెంటనే పోలీసులు అతనిని 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అడ్డుకట్టకు తొలి అడుగు



- సముద్రపు కోత నివారణకు కిలోమీటరు మేర రక్షణ గోడ
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,300 కోట్లు..
- తొలి విడతగా పీఎం లంక వద్ద పనులు
- రూ.13.50 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి టెండర్లు

నరసాపురం జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతకోత నివారణకు తొలి అడుగు పడింది. తొలి విడతగా పీఎంలంక వద్ద రూ. 13.50 కోట్లతో చేపట్టే రక్షణ గోడ పనులకు టెండర్లు ఆహ్వానించారు. గతంలో ఈ పనులకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థ డేలైట్ కంపెనీ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కోతకు గురవుతున్న సముద్ర తీరం వెంబడి రక్షణ గోడ నిర్మించాలని ప్రతిపాధించారు. చెన్నై ఐఐటీ నిపుణులు పలుమార్లు సర్వే చేసి కోత నివారణకు రక్షణ గోడ నిర్మించాలని సూచించారు. సుమారు కిలోమీటర్ మేర పనులు చేపడితే సముద్రపు కోత ప్రభావం తగ్గుతుందని నివేదిక ఇచ్చారు. దానికి అనుగుణంగా చేపట్టే పనులకు రూ.1300 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. దానిలో భాగంగా తొలి విడత పనులకు టెండర్లు పిలిచారు. ఈపనులు చేపట్టి కోత ప్రభావాన్ని అంచనా వేసి దానికి అనుగుణంగా మిగిలిన పనులు చేయాలని నిపుణులు భావిస్తున్నారు.

తరుముకొస్తున్న కడలి

నరసాపురం మండలంలో చినలంక 20ఏళ్ళ క్రితం ఒక గ్రామ పంచాయతీ. నేడు ఈ గ్రామం పూర్తిగా సముద్రగర్భంలో కలిసిపోయింది. దానికి సమీపంలో ఉన్న పీఎంలంక సముద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండేది. నేడు అరకిలోమీటర్ దూరానికి వచ్చింది. దీంతో ఈగ్రామం కూడా ఏదో ఒక రోజు చినలంక లాగా సముద్ర గర్భంలో కలిసిపోతుందన్న భయం తీర ప్రాంతవాసుల్లో నెలకొంది. కోత నివారణకు రెండు దశాబ్ధలుగా ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నాయే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టలేదు. మొగల్తూరు మండలం కేపీపాలెం, పేరుపాలెం గ్రామాల పరిస్థితి ఇంతే. సముద్రం చొచ్చుకొస్తుంది. తుఫాన్లు, వాయుగుండాలు సమయంలో ఎక్కువగా కోతకు గురి అవుతూ వస్తుంది. దీన్ని నియంత్రించేందుకు ఒడరేవుల్లో వేసే సిమెంట్ దిమ్మలు వేయాలని గ్రామస్థులు విన్నవిస్తున్నా.. ప్రయోజనం లేకుండా పోయింది. వందల కోట్లు ఖర్చుతో కూడిన పని కావడంతో ప్రభుత్వాలు కూడా ముందుకు రాలేదు.

రెండేళ్ల క్రితం పనులకు శంకుస్థాపన



రక్షణ గోడ నిర్మాణానికి సుమారు రూ.1300 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇంత మొత్తం కేంద్రం భరించడం కష్టసాధ్యమని భావించిన కేంద్ర మంత్రి నిర్మల కార్పొరేట్ సంస్థల్ని సంప్రదించారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గోడ నిర్మాణ చేపట్టి గ్రామాలను రక్షించాలని సూచించారు. దానికి స్పందించిన అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థ డెలైట్ ముందు కొచ్చింది. దీంతో 2022 అక్టోబర్ నెలలో కేంద్ర మంత్రి పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. ఇటీవల వరకు చెన్నై ఐఐటీ నిపుణులు సర్వే చేస్తూ వచ్చారు. చివరికి గత నెలలో తొలి విడతగా చేపట్టే రూ.13.50 కోట్ల పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఈ పనులను ఒక కార్పొరేట్ రంగానికి చెందిన నిర్మాణ సంస్థ దక్కించుకున్నట్లు తెలియవచ్చింది. నిర్మించే రక్షణ గోడ పీఎం లంక వేంకటేశ్వర స్వామి గుడి వద్ద నుంచి సుమారు కిలోమీటర్ మేర నిర్మించనున్నారు. తొలి విడత పనులు పూర్తికాగానే దాని ఫలితాన్ని బట్టి మిగిలిన పనులు చేపట్టాలని నిపుణులు భావిస్తున్నారు.



టెండర్లు పూర్తి : దాసి రాజు, ఆర్డీవో



కోత నివారణకు చేపట్టే రక్షణ గోడ నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. గత ఏడాది డిసెంబర్‌లో ఆహ్వానించారు. ఒక ప్రముఖ కంపెనీ టెండర్లు దక్కించుకుంది. త్వరలో పనులు చేపట్టనున్నారు. ఈ నిర్మాణ పనులన్ని డెలైట్ సంస్థ ఆర్థిక సహకారంతో జరుగుతున్నాయి.

ముప్పు తప్పినట్టే : సుబ్బు, పీఎం లంక



ఐదేళ్లుగా పనులు ఊరిస్తూ వచ్చాయి. తాజాగా టెండర్లు పిలవడంతో అడ్డుకట్టకు తొలి అడుగు పడినట్టింది. గత ఏడాదితో పొలిస్తే పీఎంలంక వద్ద సముద్రపు కోత మరింత పెరిగింది. రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టకపోతే ఏదో ఒక రోజు మా గ్రామంలో సముద్రగర్భంలో కలిసిపోవడం ఖాయం. కేంద్ర మంత్రి నిర్మలమ్మ దయతో మా గ్రామానికి ఈ ముంపు తప్పనుంది.

కేంద్ర ఆర్థిక మంత్రి జోక్యంతో కొత్త ఆశలు

పదేళ్ళ క్రితం కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మోదీ ఎంపీలను దేశంలోని గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. దానిలో భాగంగా అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ చూపు పీఎంలంక, తూర్పుతాళ్ళపై పడింది. ఈ ప్రాంతంపై ఎంతో అవగాహన ఉన్న కేంద్ర మంత్రి ఈరెండు గ్రామాలను అభివృద్ధి చేయాలని భావించారు. దానిలో భాగంగా ఈ గ్రామాల్లో పనులు చేపట్టారు. పీఎంలంకకు భారీ వంతెనల నిర్మాణాలతో పాటు డిజిటల్ కమ్యూనిటి భవనాలు నిర్మించారు. అయితే గ్రామస్తులు సముద్రపు కోత నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. అప్పటి రక్షణ మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ డిఫెన్స్‌కు చెందిన ఇంజనీర్ల బృందాన్ని పిలిపించి సర్వే చేయించారు. ఇంతటితో విడిచిపెట్టలేదు. చెన్నై ఐఐటీ నిపుణుల్ని కూడా కోరారు. నాలుగేళ్ళ నుంచి పలు విభాగాలకు చెందిన నిపుణులు, శాస్త్రవేత్తలు కోతకు గురవుతున్న ప్రాంతాల్లో పలు సర్వేలు చేసి ఒక నివేదికను రూపొందించారు. కిలోమీటర్ మేర గోడ నిర్మాణం చేపడితే కోతను కొంత మేర నివారించవచ్చునని సిఫార్స్ చేశారు.

క్రైమ్ కార్నర్

బ్యాంకు ఖాతాలో నగదు మాయం

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత మహిళ

దెందులూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎంత జాగ్రత్తగా ఉంటున్నా సైబర్ నేరగాళ్ళు బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తూనే ఉన్నారు. దెందులూరు మండలం దోసపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పనులకు వెళ్ళే ముంగర సరస్వతికి కొవ్వలి యూనియన్ బ్యాంకులో ఖాతా ఉన్నది. అకౌంట్‌లో 15వ తేదీ వరకు రూ.3,500 నగదు ఉన్నది. 16వ తేదీన తన కుమారుడిని దుబాయ్ పంపేందుకు విమాన టికెట్ నిమిత్తం బ్యాంకులో రూ.33 వేల రూపాయలు జమ చేసింది. దీంతో బ్యాంకులో మొత్తం రూ.36500 ఉన్నాయి. సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి నాలుగు విడతలుగా 5 వేలు చొప్పున రూ.20 వేలు డ్రా చేసినట్లు ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. దీంతో చదువురాని సరస్వతి తన కుమారుడికి చూపించడంతో బ్యాంకు వెళ్దామని చెప్పాడు. మరుసటి రోజు ఉదయం బ్యాంకు వెళ్లి చెప్పే సమయానికి శుక్రవారం మిగిలిన నగదు విడతల వారీగాఖాతా నుంచి కట్ అవ్వగా కేవలం 7 రూపాయలు మాత్రమే ఖాతాలో మిగిలాయి. దీనితో దెందు లూరు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



వెంకట రమణ (ఫైల్)

పాలకొల్లు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బంధువులను పరామర్శించ డానికి వెళుతున్న వివాహితను ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం అమలాపురానికి చెందిన ఊటాడ వెంకట రమణ(28) తన బంధువుల ఇంటికి సోదరుడుతో కలిసి మోటారు సైకిల్‌పై వెళ్తుంది. శివదేవుని చిక్కాల వద్ద భీమవరం నుంచి పాలకొల్లు వైపు వెళుతున్న ట్రాక్టర్ వీరి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకట రమణకు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో సోదరుడుకి స్వల్ప గాయాలయ్యాయి. పాలకొల్లు రూరల్ ఎస్ఐ బి.సురేంద్రకుమార్ కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట బోదెలో గుర్తు తెలియని మృతదేహం

పాలకోడేరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శృంగవృక్షం గ్రామంలోని ఎఫ్‌సీఐ రోడ్డులోని పంటబోదెలో గుర్తు తెలియని 50 సంవత్సరాల వయస్సు కలిగిన పురుష మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. పాలకోడేరు ఎస్ఐ రవివర్మకు గ్రామ వీఆర్వో దేవదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని బయటకు తీసి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఖాకీ రంగు నిక్కరు, స్వెట్టరు వేసి ఉన్నాడు. ఇతని ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పాలకోడేరు పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సంతోషపురం మాజీ సర్పంచ్ హత్య



కలిదిండి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంతోషపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాల్వ నల్లయ్య(60)ను అదే గ్రామానికి చెందిన బోదనపు శ్రీనివాసరావు గురువారం సాయంత్రం హత్య చేశాడని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. సంవత్సరం క్రితం బోదనపు శ్రీనివాసరావు కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుమారుడు చనిపోవటానికి ప్రధాన కారణం కాల్వ నల్లయ్య అని శ్రీనివాసరావు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. గురువారం సాయంత్రం సంతోషపురం నుంచి బైక్‌పై కలిదిండి వెళ్తున్న నల్లయ్యను మార్గం మధ్యలో శ్రీనివాసరావు అడ్డగించి ఇనుపరాడ్డుతో బలంగా తల వెనుక భాగంలో కొట్టాడు. దీంతో నల్లయ్య అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాసరావు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కైకలూరు సీఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపై కుమారుడి హత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీత

కామవరపుకోట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి తగాదాల నేపథ్యంలో తల్లిపై కొడుకు కత్తితో హత్యాప్రయత్నం చేసిన సంఘటన శుక్రవారం కామవరపుకోట మండలం అంకాలంపాడు గ్రామంలో చోటు చేసుకున్నది. తడికలపూడి ఎస్ఐ చెన్నారావు, ఏఎస్ఐ వీరాస్వామిల కథనం ప్రకారం తల్లి, కొడుకుల మధ్య ఆస్తిపై శుక్రవారం వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో హరిబాబు కత్తిపీటతో తల్లి సీతపై హత్యాయత్నంకు పాల్పడ్డాడు. దీంతో ఆమెకు రెండు చోట్ల కత్తి గాయా లయ్యాయి. ఈ సంఘటనలోనే హరిబాబు సొమ్మసిల్లి పడిపోయా డు. వెంటనే స్థానికులు తల్లి కొడుకులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇబ్బందుల్లో ఉన్నాను.. తీసుకెళ్ళండి

మరో గల్ఫ్ బాధితుడి వీడియో సందేశం



గల్ఫ్‌లో చిక్కుకున్న దంపతులు

జీలుగుమిల్లి, జనవరి, 17: (ఆంధ్రజ్యోతి): తాటియాకుల గూడెంకు చెందిన మద్దాల కృష్ణ, భార్య మహేశ్వరి కలిసి డబ్బు సంపాదన కోసం ఇటీవల ఏజెంట్ ద్వారా మస్కట్ వెళ్లారు. కొద్ది రోజులుగా దంపతులను వేరు చేశారని ఆమె ఎక్కడుందో తెలియదని కృష్ణ వాపోయాడు. వారం రోజులుగా తిండి లేకుండా అక్కడ ఇబ్బందులు పడుతున్న బాధితుడు మద్దాల కృష్ణ కుటుంబీకులకు తాను ఇబ్బందుల్లో ఉన్నట్లు వీడియో పంపాడు. తాను కొద్ది రోజులుగా అన్నం దొరక్క ఇబ్బంది పడుతున్నానని స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ద్వారా తనని, భార్యను ఇండియాకు తీసుకెళ్లేలా చూడాలని వీడియోలో బోరున విలపించాడు. దీంతో కుటుంబీకులు శుక్రవారం సర్పంచ్ వనమ రాంబాబు గ్రామస్తులతో కలసి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యేను కలిసిన బాధితుడి తల్లి, అక్కకు తెలిపారు. అనంతరం ఫోన్‌లో భీమవరం ఏజెంట్‌తో మాట్లాడారు. సంబంధిత అధికారులకు విషయం తెలియజేశారు.

కిడ్నాప్‌కు గురైన రొయ్యల వ్యాపారి ఆచూకీ లభ్యం

అనంతపురంలో పట్టుకున్న పోలీసులు



కిడ్నాప్‌కు గురైన వ్యాపారి నాని

భీమవరం క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద పట్టపగలే కిడ్నాప్‌కు గురైన వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లుగా సమాచారం. భీమవరం మెంటేవారితోటకు చెందిన విశ్వనాథుని వెంకట సత్యనారాయణ (నాని) స్థానిక రెస్ట్‌హౌస్ రోడ్డులో రొయ్యల షెడ్ నడుపుతున్నాడు. కొంత కాలంగా ఆర్థిక లావాదేవీలున్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే అనంతపురం ప్రాంతానికి చెందిన ఒక మాజీ రాజకీయ నాయకుడికి సంబంధించిన నలుగురు వ్యక్తులు భీమవరం కారులో వచ్చి కిడ్నాప్ చేసి తీసుకెళ్ళినట్లుగా పోలీసులకు సమాచారం అందిందని తెలిసింది. బాధితుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బృందాలుగా ఏర్పడ్డారు. తీసుకెళ్ళిన కారు విజయవాడ టోల్‌గేటు వద్ద గుర్తించినట్లుగా తెలిసింది. అయితే తీసుకువెళ్ళిన నలుగురు వ్యక్తులు ఆ కారును విజయవాడలో వదిలి వెళ్ళిపోయినట్లుగా సమాచారం. దీంతో పోలీసులు ఆ కారుకు సంబంధించిన వారిని విచారణ చేయగా వారు ఇచ్చిన ఆధారాలను బట్టి అనంతపురం తీసుకువెళ్ళినట్లుగా తెలియడంతో అక్కడ పోలీసులు జల్లెడ పట్టి వారిని పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళినట్లుగా సమాచారం. సమాచారం అందుకున్న భీమవరం పోలీసులు అనంతపురం వెళ్ళి బాధితుడిని, నిందితులను తీసుకొస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. తీసుకెళ్ళిన వ్యక్తులకు వెంకట సత్యనారాయణ సుమారు రూ.14 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. కిడ్నాప్‌కు కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో వీఆర్వో



వీఆర్వో నాగ గంగరాజు

ఉండ్రాజవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక వీఆర్వో ఆత్మహత్య చేసుకున్న సంఘటన వండ లంలోని పాలంగి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పాలంగి గ్రామానికి చెందిన యార్లగడ్డ నాగగంగరాజు(41) తణుకు పట్టణంలో ఏడో వార్డు సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాలంగిలో గతంలో వీఆర్ఏగా పని చేస్తూ పదోన్నతిపై వీఆర్వోగా తణుకులో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి విధులు ముగించుకుని పాలంగిలోని ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి బంధువులు తలుపులు పగులగొట్టి తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కాగా గంగరాజుకు భార్య లక్ష్మి, కుమారులు వేణు, అఖిల్ ఉన్నారు. భార్య జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌దేశంలో ఉంది. కుమారులిద్దరు సంక్రాంతి పండుగకు అమ్మమ్మ ఊరైన మండలంలోని మోర్త గ్రామం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల పాలుకావడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, ఎవరి ప్రమేయం లేదని సూసైడ్ నోట్ రాసినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి వృద్ధుడి..

భీమవరం క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నరసాపురం నుంచి నాగర్‌సోల్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఒక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే సీఆర్‌పీ హెచ్‌సీ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొల్లు మండలం లంకలకోడేరు, వెదుర్లపాలెం గ్రామానికి చెందిన మాడు వెంకటేశ్వరరావు (66) ఇటీవల గుండె సమస్యలతో బాధపడుతున్నాడు. అతనికి ముగ్గురు కుమారులు. ముగ్గురికీ వివాహాలయ్యాయి. ఈ నేపథ్యంలో అనారోగ్య సమస్యలతో వెంకటేశ్వరరావు శుక్రవారం ఉదయం టౌన్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలు కింద పడ్డాడు. రైల్వే స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టాలు..

భీమవరం క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు. కోనసీమ జిల్లా మల్కిపురం గ్రామానికి చెందిన బట్టు దుర్గాప్రసాద్ (24)కు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టాలు వచ్చాయి. అతని తండ్రి బట్టు కృష్ణమూర్తి భీమవరం ఒకటవ పట్టణంలో లాడ్జి నడుపుతున్నాడు. ఏమైందో కాని దుర్గాప్రసాద్ ఈ నెల 16వ తేదీన భీమవరం వచ్చాడు. రెండవ పట్టణంలోని ఒక లాడ్జి రూము తీసుకున్నాడు. శుక్రవారం ఉదయానికి బయటకు రాకపోవడంతో లాడ్జి యజమాని తలుపులు బద్ధలుకొట్టి చూడగా సీలింగ్ రింగ్‌కు తాడుతో ఉరి వేసుకుని వ్రేలాడుతూ ఉండటంతో కిందకు దింపి చూడగా అతను మృతి చెందినట్లు నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై మృతుని తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

బుట్టాయగూడెం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ వైద్య శిబిరాలు, పేదలకు దోమతెరల పంపిణీ, రైతులకు టార్పాలిన్లు, పట్టాలు పంపిణీ, పిల్లలకు పుస్తకాలు పెన్నుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ సేవా స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఎం.బాలు, జి.వెంకట్రావు, మడకం కన్నపరాజు, వంకా సూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి

గిరిజన యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచేందుకు ఐటీడీఏ ద్వారా చర్యలు చేపట్టాలని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్‌కు సూచించారు. శుక్రవారం పీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన ట్రైకార్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. ట్రైకార్ ద్వారా ఎక్కువ నిధులు కేటాయించి ఉపాధి అవకాశాలను కల్పించాలని పీవోను కోరారు. అంతకముందు పీవో ఎమ్మెల్యే చిర్రి బాలరాజును బర్రింకలపాడులో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఐటీడీఏ పనితీరుపై చర్చించారు.

రేషన్ దుకాణాల కేటగిరి మార్పు చేయాలి



నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం ఇస్తున్న విక్రమ్‌కిశోర్

ఏలూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపులు ఇప్పటివరకు కొనసాగుతున్న కేటగిరిలు మార్చి ఇతరులకు కేటాయించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిశోర్ కోరారు. పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. లింగపాలెం మండలంలో చౌకధరల దుకాణాల కోసం నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. 30ఏళ్లకు పైబడి మఠం గూడెం రేషన్‌షాపు జనరల్ కేటగిరిలో ఉందన్నారు. ఇప్పుడు ఎస్సీ కేటగిరిలో ఇచ్చారని తెలిపారు. అలాగే మండలంలో ఇతర షాపులు కూడా ఇప్పటివరకు కొనసాగుతున్న కేటగిరిలు మార్చి ఇతరులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గత రిజర్వేషన్ ప్రకారం యదావిధిగా చౌకడిపోలు కేటాయించాలని, లేనిపక్షంలో మండలంలోని అన్నిషాపులు రద్దుచేసి రిజర్వేషన్ ప్రకారం కొత్తషాపులు కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో కృష్ణప్రసాద్, చక్రధర్, జాస్తి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పూలే జయంతి నాడు సెలవుదినంగా ప్రకటించాలి



మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఏప్రిల్ 11న జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యాలయాల్లో ఏపీబీసీ ఓబీసీ ఉద్యోగుల సమావేశాల నిర్వహణకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో మహాత్మ జ్యోతిరావుపూలే స్మారక స్ఫూర్తి భవన నిర్మాణానికి 25 ఎకరాల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు వి.ఏసురాజు, జి.శ్రీనివాసరావు ఉన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలి

ఏలూరు కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి పగలు తొమ్మిది గంటలుపాటు విద్యుత్ సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నేభవనంలో వ్యవసాయ విద్యుత్ సమస్యలపై జరిగిన సమావేశానికి సంఘ జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఏడు గంటలకు కుదించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న, మిర్చి, వర్జీనియా పొగాకు పంటలతోపాటు ఉద్యాన పంటల రైతులు ఇబ్బందులు పడతారన్నారు. కొన్ని పంటల దిగుబడిపై ప్రభావం ఉంటుందని అన్నారు. వ్యవసాయానికి పగలు తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. కొత్తగా బోర్లు వేసు కున్న రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిరిబత్తుల సీతారామయ్య తదితరులు ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నా విజయవంతమైందని కె.శ్రీనివాస్ తెలిపారు. పెట్టుబడి సాయం 20 వేలు తక్షణమే రైతు ఖాతాల్లో వేయాలని, పంటల బీమా అమలు చేయాలని, వెనుకబడిన ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

జగనన్న ఇళ్ల స్థలాల అవినీతిపై విచారణ జరిపించాలి

లింగపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల స్థలాలలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని ఏపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధరరావు అన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గురువారం రాత్రి కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జగనన్న లేఅవుట్లకు భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, మెరక పనులలో భారీగా అవకతవకలు అక్రమాలు జరిగాయని వీటిపై సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం చెయ్యాలని కోరినట్లు ఆయన తెలిపారు. రేషన్ షాపులలో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించాలని కోరినట్లు తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ సానుకూలంగా స్పందించారని రేషన్ షాపులు, జగనన్న ఇళ్లస్థలాలలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారితోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భోగోలు హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

లింగపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగోలు హైస్కూల్‌లో 2004-2005 పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పాఠశాలలో కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషమని ఆనాటి ఉపాధ్యాయులు అన్నారు. అప్పటి హెచ్‌ఎం కమలాబాయి, ఉపాధ్యాయులు సువర్ణరాజు, ఝాన్సీలక్ష్మిబాయి, ప్రసాద్, రామ్మోహన్‌రావు, రామచంద్రరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ పూర్వ విద్యార్థులు

కుక్కునూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అమరవరం ఎస్సీ హాస్టల్‌లో 2014 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం కలిశారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాస్టల్ వార్డెన్‌గా పనిచేసిన తంబళ్ళ కన్నయ్య దంపతులను సన్మానించారు. హాస్టల్ మూసివేశారని, తెరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. పూర్వపు విద్యార్థులు నడిపల్లి వెంకటేశ్వర్లు, బుయ్యన నాగేశ్వరరావు, ఎం.వెంకప్ప, వెంకటి, కాంతారావు, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో..



దేవస్థానం సంస్కృత పాఠశాల పూర్వ విద్యార్థులు

ద్వారకాతిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం ఆ పాఠశాలలో చదువుకున్న వారంతా శుక్రవారం అక్కడకు చేరుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను, అల్లరిని గుర్తుకు తెచ్చుకున్నారు. శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో 1998- 1999లో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉన్నత విద్యకు సహకరిస్తానని బండారు కల్యాణ్ ప్రకటించడంతో ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదమరిస్తే.. ఊచకోత

ప్రాథమిక పాఠశాల ఆవరణలో అసంపూర్తి నిర్మాణం

ఊచలతో విద్యార్థులకు పొంచివున్న ప్రమాదం



ఇందిరా నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రమాదభరితంగా ఉన్న ఇనుప ఊచలు

ఏలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణం ఇందిరానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఏమాత్రం ఆదమరపుగా ఉన్నా ఊచకోత తప్పదు. ఆవరణలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పునాదులకు నిలబెట్టిన ఊచలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీనితో కట్టడంలో భూమిపై ఉన్న ఊచలు విద్యార్థులకు ప్రమాదం తెచ్చేవిగా ఉన్నాయి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నాడు నేడు పనుల్లో భాగంగా విద్యార్థులకు తాగునీటి సౌకర్యానికి వాటర్ ట్యాంక్, ఆర్వో ప్లాంట్ మంజూరైంది. రెండో ఫేజ్‌లో ప్రారంభించిన పనులు నిధులు లేక నిలిచిపోయాయి. దాదాపు ఏడాది కాలంగా ఊచలు ఇలానే పైకి లేచి ఉన్నాయి. పాఠశాల ఆవరణ కాస్త ఎత్తుగా ఉండడం ట్యాంక్ నిర్మాణం కిందికి ఉండడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఇదే పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు కూడా విద్యనభ్యసిస్తున్నారు. అధికారులు స్పందించి విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా పైకి లేచి ఉన్న ఊచలు సరిచేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరియం నాగేశ్వరరావును వివరణ కోరగా ప్రస్తుతం పనులు నిలిచిపోయాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



కలెక్టర్ వెట్రిసెల్వితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి



జలజీవన్ మిషన్‌పై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయండి

పెండింగ్ పనులపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి

ఏలూరు టూటౌన్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే బడేటి చంటి కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యే చంటి శుక్రవారం కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. హనుమాన్‌నగర్, రామకృష్ణపురంలో ఆస్తులు రిజిస్ట్రేషన్ అవ్వక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 22ఎ రెడ్‌మార్క్ కింద భూములున్నాయన్నారు. రెడ్‌మార్క్ ఉన్న భూములు రిజిస్ట్రేషన్ చేయరని, ఆ భూములకు 22ఎ సెక్షన్ తొలగించి రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలన్నారు. పిల్లలు పెద్దవాళ్లు అయ్యి పెళ్లిళ్లు చేసుకుంటున్నారని, భూములు మాత్రం రిజిస్ట్రేషన్ కావడం లేదని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. జూట్‌మిల్లు ఎదురుగా రూ.5కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. మెడికల్ కాలేజీ హాస్టల్ కోసం భవనాలు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే చంటి చర్చించిన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కలెక్టర్ వెట్రి సెల్వి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

వైసీపీ పాలనలో ప్రజాసమస్యలు తిష్ట వేశాయని వాటన్నిటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాసమస్యల వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. పత్తేబాద రైతు బజారు వద్ద పార్కింగ్ స్థలంలేక ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమస్యని పరిష్కరించాలని ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావును ఆదేశించారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, త్రిపర్ణరాజేష్, పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు.

రక్షిత నీరు అందిస్తాం

ఉంగుటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి పూర్తిస్థాయిలో రక్షిత నీరు సరఫరాకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలజీవన్ మిషన్ పథకంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. గతంలో మంజూరై రద్దు కాబడిన పనులలో తాగునీటి సరఫరా పనులను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం తదితర అంశాలపై తక్షణం నివేదిక సమర్పించాలని కోరారు.

నేడు స్వచ్ఛ దివస్ కార్యక్రమం

ఏలూరు టూటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతీ నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. శనివారం పాత బస్టాండ్ ప్రాంగణంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది హాజరుకావాలన్నారు.

సందర్శన వేళలు సూచించండి

ఏలూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డీపీవో కార్యాలయంలో సందర్శకుల సమయాలను ప్రదర్శించాలని ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణానాయక్, రాజబాబు నాయక్ కోరారు. జిల్లాలోని గిరిజన లంబాడీ తండాల్లో ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యలపై డీపీవోకు తెలియజేసేందుకు గురువారం ఉదయం వెళ్లగా సాయంత్రం దాటినా అనుమతించకపోవడంతో వెనుదిరగాల్సి వచ్చిందన్నారు. విజిటర్స్ సమయాలను తెలియజేసే నోటీసు బోర్డులను కార్యాలయంలో ఉంచాలన్నారు.

శీతాకాలం జాగ్రత్తలపై అవగాహన

ఏలూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దగ్గు, జలుబు, ఆయాసాలను అశ్రద్ధ చేయవద్దని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి నికిత సూచించారు. స్థానిక తాపీమేస్త్రీకాలనీ, టైటస్‌నగర్‌లలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో శీతాకాలం పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ఉంగుటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం నేరమని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి వర్మ అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాల నిరోధంపై ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌యూ.రత్నరాజ్యం, హెల్త్ విజిటర్ వీవీ.నాగలక్ష్మి, వెంకట రమణ, ఆశాలత, శిరీష, రేఖ తదితరులు పాల్గొని ప్రచారంతో పాటు ర్యాలీ నిర్వహించారు.

జ్యోతిబసు జీవితం దేశానికే ఆదర్శం

ఏలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు జీవితం దేశానికే ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. జ్యోతి బసు 16వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో శుక్రవారం నిర్వహించారు. జ్యోతిబసు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రామకృష్ణ, టి.ముత్యాలమ్మ, ఎం.సుధారాణి, నాగేంద్ర, నాని, రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

భీమడోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుండుగొలనులో ఉపాధి పనులు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సొసైటీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కరరావు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. దాళ్వా వరి నాట్లు పూర్తికావడంతో కూలీలు పని లేకుండా ఉన్నారని, ఉపాధి పనులు కల్పించాలన్నారు. గుండుగొలనులో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఉపాధి హామీ అధికారులు, ఎంపీడీవోకు అందజేశారు.

22న నేషనల్ కెరీర్ సర్వీస్ జాబ్‌మేళా

ఏలూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఈనెల 22న నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి సి.మధుభూషణ్‌రావు శుక్రవారం తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలోని క్యాడ్బరీ మోండలిజ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. పశ్చిమ ఆసియాలో అతిపెద్దదైన క్యాడ్బరీ చాక్లెట్ తయారీ కంపెనీలో టీమ్ మెంబర్ ట్రైనీగా పనిచేసేందుకు ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ మొదటి ప్రయత్నంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. 18 నుంచి 22 ఏళ్ల వయస్సు వారు అర్హులు అన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి సుమారు రూ.2.34 లక్షలు జీతం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందన్నారు. అభ్యర్థి ఉన్నత చదువులకు, స్కిల్ ట్రైనింగ్‌లో కూడా అవకాశంతో పాటు సబ్సిడీపై ఇతర సదుపాయాలు కల్పించబడునన్నారు. విభిన్న ప్రతిభావంతులు కూడా మెగా జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. మరింత సమాచారానికి 8886882032నెంబర్లో సంప్రదించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు సాగుచేస్తున్న భూములకు ఎస్‌డీసీ కోర్టు తీర్పులు అనుకూలంగా ఉన్నప్పటికీ గిరిజనేతరులకు ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ జైనవారిగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.41/2లోని 2.50 ఎకరాల భూమికి గిరిజనేతరుడికి అధికారి ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చారన్నారు. ఇరుపక్షాల రికార్డులను పరిశీలన చేయకుండా ఏకపక్షంగా అధికారి ఆర్డర్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. గిరిజనులకు అనుకూలంగా తీర్పులున్నా అధికారులు మాత్రం సొమ్ములకు అమ్ముడుపోయి గిరిజనేతరులకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. గిరిజనులకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను కోరారు. గిరిజనులు సోయం శ్రీనివాస్, ఇరప అన్నపూర్ణ ఉన్నారు.

ఆర్ఆర్ పేట ఆలయంలో బ్రహ్మోత్సవాలు



అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

ఏలూరు కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గత నెల 28న ప్రారంభమైన త్రినప్తాహ బ్రహ్మోత్సవాలు శనివారం ముగియనున్నాయి. ప్రతీరోజు ఉదయం స్వామి, అమ్మవార్లకు భక్తులు సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నారు. స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. భగవద్గీత పారాయణ మండలి సభ్యులు భగవద్గీతను విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్నారు. కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు, కిళాంబి పవనకుమార్ పూజలు, జరిపిస్తున్నారు. ఆలయ ఈవో నల్లూరి సతీష్ కుమార్, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యు ద్దీపాలతో అలంకరించారు. ఈనెల 25న భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు.

ద్వారకాతిరుమలకు భక్తుల పాదయాత్ర



రాళ్లకుంట శివారులో పాదయాత్రగా వెళుతున్న భక్తులు

ద్వారకాతిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి పాదయాత్రగా భక్తులు శుక్రవారం విశేషసంఖ్యలో తరలివచ్చారు. నల్లజర్ల మండలం అయ్యవరం మీదుగా మండలంలోని రాళ్లకుంటలోకి ప్రవేశించారు. నిడమర్రు, పెనుమంట్ర మండలం, జిల్లాలోని పలు ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి శ్రీవారి క్షేత్రానికి చేరుకుని శనివారం తెల్లవారుజామున స్వామి తొలి దర్శనాన్ని చేసుకోనున్నారు. పంచమి తిథి మంచిది కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

అనుమతులు చూపండి

లాడ్జి యజమానులకు నోటీసులు

చిన వెంకన్న క్షేత్రంలో ట్రస్టులు, ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ లాడ్జిల యజమానులకు శుక్రవారం తహసీల్దారు జేవీ.సుబ్బారావు నోటీసులు జారీ చేశారు. భూ సంబంధిత ఆధారాలు, లాండ్ కన్వర్షన్, బిల్డింగ్ అప్రూవల్, ప్లాన్, ఫైర్ సేఫ్టీ అనుమతి పత్రాలు చూపాలని నోటీసులో ఆదేశించారు. పార్కింగ్ స్థలం. నీరు సరఫరా, విద్యుత్, వేస్ట్ మేనేజ్‌మెంట్, రూముల సామర్థ్యం, క్రౌడ్ మేనేజ్‌మెంట్ అనుమతి పత్రాలు, జీఎస్టీ వివరాలను తెలియజేయాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్వారకాతిరుమలలో దాదాపు 50 పైగా లాడ్జిలు, ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. వాటిలో కొన్నిటికే నోటీసులు జారీ చేశారు. మిగిలిన వాటికి అందాల్సి ఉంది. లాడ్జిలు, ఫంక్షన్ హాల్స్ యజమానులు పంచాయితీకి పన్నులు చెల్లించి వ్యాపారాలు సాగిస్తున్నారు. పదేళ్ల క్రితమే నిర్మించిన వాటికి అధికారులు ఇప్పుడు నోటీసులు జారీ చేయడం ఏమిటని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

ఇంటర్వ్యూ..

వ్యవసాయానికి సాగు నీరు అందడం లేదు



పర్వతనేని రంగారావు
తూర్పు కాల్వ సాగునీటి సంఘం అధ్యక్షుడు

- **రైతులకు సాగునీటి సమస్య..?**
గత వైసీపీ ప్రభుత్వం కాల్వలను నిర్లక్ష్యం చేసింది. పలుచోట్ల కాల్వ బలహీన పడి తుప్పలు పెరిగిపోయాయి. వ్యవసాయ భూములకు సాగునీరు రావడం లేదు.
- **తూర్పు కాలువ పరిధి ఎంత**
విజయవాడ నుంచి వచ్చిన కాల్వలో ఏలూరు జిల్లాలో తంగెళ్లమూడి వద్ద ప్రారంభమవుతుంది. సోమవరప్పాడు, దెందులూరు, సీతంపేట, ముప్పవరం వరకు 16 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది.
- **కాల్వ ఆయకట్టు పరిధి..?**
తూర్పు కాలువ పరిధిలో ముప్పవరం పెద్ద చెరువుతో పాటు 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.
- **కాల్వ పరిధిలో సాగునీటి సమస్య..?**
తూర్పు కాలువ పరిధిలో 20 తూరల సమస్య ఉంది, షట్టర్లు నిర్మించాల్సి ఉంది. గ్రామల పరిధిలో హెడ్‌వాల్స్ కట్టి వాటి వద్ద కాల్వకు సైడ్ వాల్స్ కట్టి తలుపులు బిగించాల్సి ఉంది.
- **కాల్వ అభివృద్ధికి నిధులు..?**
తూర్పుకాలువ అభివృద్ధి, తూముల ఏర్పాటు, షట్టర్లు తదితర సమస్యల పరిష్కారానికి సుమారు రూ.5 కోట్లు అవసరం. ఎమ్మెల్యే సహకారంతో కాల్వల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్

ఉంగుటూరు, జనవరి (ఆంధ్రజ్యోతి): మండలంలో 6 రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు తహసీల్దార్ వై.పూర్ణచంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. 1, 3, 9, 14, 26, 29 దుకాణాలకు దరఖాస్తుల కోసం రిజర్వేషన్ వారిగా సంబంధిత సచివాలయాల్లో నోటిఫికేషన్ ప్రదర్శన చేశామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం లేదా ఆర్డీవో కార్యాలయంలో అందించాలన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒక యువకుడు శుక్రవారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒడిశాకు చెందిన లోకనాథ్ మిరిడియా (33) స్వీట్ మేజిక్ కార్ఖానాలో పనిచేస్తున్నాడు. మిత్రులతో కలసిశుక్రవారం రాత్రి వట్లూరు రైల్వేస్టేషన్ వద్ద పట్టాలుదాటుతుండగా రైలు లోకనాథ్ మిరిడిని ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ పి సైమన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో మోటార్ సైకిల్‌కు కుక్క అడ్డురావడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలవరం పంచాయతీ కమ్మరగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి గంగాభవాని, కడితాల సిద్ధు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా తాడిపూడి సమీపంలో కుక్క రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడ్డ వారిని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

థియేటర్ వద్ద తోపులాట

ఏలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలోని రాజరాజేశ్వరి థియేటర్‌లో టికెట్ కౌంటర్ సిబ్బంది, యువకుల మధ్య శుక్రవారం గొడవ జరిగింది. సమాచారం అందుకున్న తహసీల్దారు కె.స్లీవజోజి, ఎస్సై ఎస్‌కె.జబీర్ విచారణ చేపట్టారు. థియేటర్ యాజమాన్యంతో తహసీల్దారు మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. థియేటర్ సిబ్బంది టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని పలువురు యువకులు ప్రశ్నించడంతో సిబ్బంది గొడవ పెట్టుకున్నారని పలువురు తెలిపారు.

కోడి పందేల్లో 25 మందిపై కేసు

ఏలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో కోడి పందేలపై దాడులు చేసి 25 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. మరో 50 మందిని తహసీల్దారు కోర్టులో హాజరు పరిచామన్నారు. 12 కోడిపుంజులను, 24 కోడి కత్తులు, రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా స్థావరాలపై దాడి

చింతలపూడి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తెలార్లపల్లిలో సారా స్థావరాలపై దాడులు చేశారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో సీఐ భోగేశ్వరరావు, చింతలపూడి, ఏలూరు ఎస్ఐలు ఆరీఫ్, వై.గౌరీశంకర్, అబ్దుల్‌ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

- ఏలూరు: జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లిలో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఎస్సై సుబ్రహ్మణ్యం,సిబ్బంది పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం: మండలంలోని మండపేట నుంచి ముద్దప్పగూడెం రహదారుల్లో మోటర్‌సైకిల్‌పై 20 లీటర్ల సారా తరలిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారు. సారా తీసుకెళ్తున్న రమణపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పోలవరం ఎక్సైజ్ సీఐ వీరబ్రహ్మం తెలిపారు.



కేరట్ మనదే!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

'కేరో' అనే ఇండో-యూరోపియన్ మూల పదానికి 'కొమ్ము' ఆకారంలో ఉండేదని అర్థం. పసుపుకొమ్ము, శొంఠి కొమ్ము లాగానే 'కేరెట్ కొమ్ము' అని వాడేవారు. చాలామంది ఇది విదేశాల నుంచి మనకు దిగుమతి అయిన దుంప అని భావిస్తారు. వాస్తవానికి ఈ దుంప మన దేశంలో కొన్ని వేల ఏళ్లుగా పండుతోంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలు గుంజన దుంపలు, గాజర గడ్డలనే పేర్లతో కేరట్‌నే పేర్కొన్నాయి. 16వ శతాబ్ది నాటి భోజన కుతూహలం, 17వ శతాబ్ది నాటి హంసవింశతి గ్రంథాలలో ఈ దుంప ప్రస్తావన ఉంది.

మనకు దొరికే గాజర దుంపలు లేత కాషాయ రంగులో ఉంటాయి. ఇవి మిగిలిన రంగుల్లో కూడా మనకు లభ్యమవుతాయి. కేరట్ కాయలను మెరికార్స్ అంటారు. మానవ శరీరంలో నిర్మాణ క్రియలకు సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని సరిచేసే గుణం వీటికుంది. ఇక కేరట్‌లోని బీటాకెరోటీన్ అనే పదార్థంవల్ల ఆ దుంపలకు కాషాయ వర్ణం ఏర్పడుతుంది. సాధారణంగా మొక్కల్లోని కణాలను అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి ఈ బీటాకెరోటిన్ కాపాడుతూ ఉంటుంది. అందువల్లే కేరట్‌ను తింటే బీటాకెరోటిన్ శరీరానికి అందుతుంది. చర్మం నిగనిగలాడుతుంది. అంతే కాకుండా కంటి చూపు మెరుగుపరచటానికి కూడా కేరట్ ఉపకరిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ సైనికులకు కంటి చూపు మెరుగుపరచటం కోసం కేరట్‌ను ఆహారంగా పెట్టేవారట!



కేరట్, ముల్లంగి, కీర... ఈ మూడు దుంపలను సమాన పరిణామాల్లో తీసుకొని జ్యూస్ చేసుకొని రోజూ ఉదయం తాగితే శరీరంలోని అనేక రకాల రోగాలు తగ్గుతాయి. దీనిలో కొద్దిగా పెరుగు కలిపినా మంచిదే.

'భోజన కుతూహలం' గ్రంథం ప్రకారం కేరట్ వల్ల కలిగే ప్రయోజనాలివి...

- కేరట్‌లు కఫ దోషాలను పోగొడతాయి. కడుపు ఉబ్బరాన్ని, ఆమ్లాలను తగ్గిస్తాయి.
- నులిపురుగులను అరికడతాయి. కడుపునొప్పి వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తాయి.
- శరీరంలో వేడి తగ్గుతుంది. చలవ చేస్తుంది. దప్పిక కూడా తగ్గుతుంది.
- స్త్రీలలో రక్తస్రావాన్ని అరికట్టడానికి ఇవి ఉపకరిస్తాయి
- అమీబియాసిస్ వ్యాధి ఉన్నవారికి కేరట్‌వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ...
ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని...
అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో
తయారుచేసిన పచ్చళ్లనే తినమని
డాక్టర్లు సూచిస్తూ ఉంటారు.
అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ...
మీ కోసం.



వంటిల్లు

తాజా తాజా చట్నీలు

మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

కావాల్సిన పదార్థాలు:

ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం: అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అర చెంచా, టమోటా ముక్కలు- ఒక కప్పు, కేరట్- అర కప్పు, బీన్స్- పావు కప్పు, కాలీఫ్లవర్- అర కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, చింతపండు రసం- రెండు చెంచాలు, పంచదార- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, జీలకర్ర- ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత

తయారీ విధానం:



- కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
- ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
- కూర ముక్కల్లోని నీళ్ల ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
- ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
- వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

జాగ్రత్తలు:

- పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
- ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

ముల్లంగి ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

తరిగిన కొత్తిమీర- అర కప్పు, ముల్లంగి ఆకులు- అర కప్పు, ముల్లంగి ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, నిమ్మకాయ రసం- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం:

- మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.

జాగ్రత్తలు:

- కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
- నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

చేమ ఆకుల చట్నీ

కావాల్సిన పదార్థాలు:



సన్నగా తరిగిన చేమ ఆకులు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు స్పూన్లు, చింత పండు రసం- రెండు చెంచాలు, బెల్లం పొడి- రుచికి తగినంత, కొబ్బరి తురుము- నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
- ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
- మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.

జాగ్రత్తలు:

- లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకు కూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.
- బెల్లం బదులు పంచదార కూడా వేసుకోవచ్చు

దుస్తులపై మరకలా... వదిలించండిలా...


ఒక్కోసారి బట్టలపై అనుకోనివిధంగా మరకలు పడుతుంటాయి. సబ్బుతో ఉతికినా, వాషింగ్ మెషిన్‌లో వేసినా అవి పోవు. కొన్ని చిట్కాలు పాటించి మొండి మరకలను సైతం సులువుగా పోగొట్టుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!

- బట్టలపై సిరా మరకలు పడితే వాటి మీద కొద్దిగా శానిటైజర్ లేదా పెర్ఫ్యూమ్ చల్లి దూదితో రుద్దాలి. ఒక చెంచా బేకింగ్ సోడాని నీళ్లతో తడిపి ముద్దలా చేసి ఈ మిశ్రమంతో రుద్దినా సిరా మరకలు వెంటనే పోతాయి. మరక మీద కొద్దిగా డెటాల్ వేసి అయిదు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత టూత్ బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది.
- బట్టల మీద టీ లేదా కాఫీ ఒలికి మరకలు పడుతుంటాయి. అలాంటపుడు ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మరకమీద రుద్దితే ఫలితం ఉంటుంది. మరక మీద టూత్ పేస్ట్ రాసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో కడిగి సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- పార్కులో కూర్చున్నపుడు లేదా తోటపనిచేసినపుడు బట్టల మీద మరకలు ఏర్పడుతుంటాయి. అర బకెట్ నీళ్లలో అయిదు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపండి. ఈ నీళ్లలో బట్టలను గంటసేపు నానబెట్టి తరవాత సబ్బుతో ఉతికితే మరకలన్నీ పోతాయి. టమాటా, తుప్పు, జ్యూస్, రక్తం మరకలను కూడా ఈవిధంగానే పోగొట్టవచ్చు.
- చాక్లెట్ మరకలైనపుడు ఆ బట్టలను.... బట్టల సోడా కలిపిన నీళ్లలో అరగంటసేపు నానబెట్టి సబ్బుతో ఉతికితే చాలు.
- బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసినపుడు కొన్నిటి రంగులు మిగతా వాటికి అంటుకుంటుంటాయి. సబ్బుతో రుద్దినా ఆ మరకలు పోవు. వాటి మీద 90 శాతం ఆల్కహాల్ ఉన్న ద్రావణాన్ని చల్లి దూదితో రుద్దితే రంగుల మరకలు పోతాయి.
- రక్తం మరకలు పడినపుడు వాటి మీద హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం చల్లి అరగంటసేపు ఉంచాలి. తరవాత సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- నూనె మరకలు పడినపుడు వాటి మీద డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా బేకింగ్ సోడా చల్లి అరగంట తరవాత టూత్‌బ్రష్‌తో రుద్దితే చాలు.
- బకెట్ వేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్, కొద్దిగా బట్టల సోడా వేసి బాగా కలిపి అందులో బట్టలను నానబెట్టాలి. అరగంట తరవాత వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరవేస్తే తేలికపాటి మరకలన్నీ పోతాయి.



చిత్రజ్యోతి
SINCE 1965

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి



పురాణ పరిజ్ఞానంలోనూ అన్నగారు మిన్న!

'ధన, రుణ సమ్మిళితం శక్తి-తత్ఫలితం సృష్టి' అన్నది అనాదిగా జగమెరిగిన సత్యం! పాజిటివ్, నెగిటివ్ అన్నవి లేకుంటే పవర్ లేదన్న విషయం సైన్స్ కూడా ధ్రువీకరిస్తోంది. దీనిని అనుసరించే కళలు కాంతులీనాయని ప్రతీతి. రచనలోనూ ఈ విషయాన్నే స్మరిస్తూ ఓ కథలోని ప్రధాన పాత్రల్లోని తప్పొప్పులను విశదీకరిస్తూ సాగారు. వేద వ్యాస భగవానుడు కూడా అదే తీరున పంచమ వేదం మహాభారతాన్ని రచించారు. యూదు, క్రైస్తవ, ఇస్లామ్ మతస్థులు పవిత్రంగా భావించే మోజెస్ రచనలు సైతం ఇదే పంథాను అనుసరించాయని చెప్పవచ్చు. ఇవన్నీ తెలుగు చిత్రసీమలో పౌరాణికాలతో కళాఖండాలు తెరకెక్కించిన వారికి తెలియనివి కావు. అలాగే ప్రపంచంలోనే అత్యధిక పౌరాణిక చిత్రాల్లో నటించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుకు కూడా ఆ పురాణపరిజ్ఞానం ఉందనే విషయాన్ని ఆయన తెరకెక్కించిన పురాణగాథలు చెప్పకనే చెబుతాయి.

● ఈ మధ్య ఎన్టీఆర్ పుట్టిన గడ్డపైనే నిల్చుని అనంతమైన అవివేకం ప్రదర్శిస్తూ కర్ణుని పాత్రను గొప్పగా చిత్రీకరించడం తప్పు అని ఇంకా ఏవేవో చెప్పారు. 'దానవీరశూర కర్ణ'లో కర్ణుడిని గొప్పగా చూపించడం వల్లే తరువాతి తరాల వారు కర్ణ పాత్రను ఎంతో ఉదాత్తంగా భావిస్తున్నారని వారి భావన! నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు కూడా ఎంతోమంది కర్ణుని గొప్పతనం గురించి పౌరాణిక చిత్రాల్లో ప్రస్తావించినవారున్నారు. ఘోష యాత్ర సమయంలోనూ, గోగ్రహణ సమయాన కర్ణుడు పరాజితుడైన మాట వాస్తవమే! అయితే అదే కర్ణుడిపై దుర్యోధనునికి ఎందుకంత నమ్మకం అంటే అస్త్రశస్త్ర రచనలోనూ, గదాయుద్ధంలోనూ ప్రావీణ్యం ఉన్న జరాసంధుని సైతం కర్ణుడు నిలువరించి ఉంటాడు. అందువల్ల దుర్యోధనునికి కర్ణుడంటే అంతటి విశ్వాసం! ఇక తన ప్రాణరక్షితాలైన సహజ కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చిన సమయంలోనే బలి, శిబి, దధీచి వంటి పుణ్యాత్ముల సరసన చేరాడు కర్ణుడు. ఇవన్నీ కాదు సాక్షాత్తు వేదవ్యాసుడే కర్ణుని గొప్పతనాన్ని వివరిస్తూ 'మహాతేజస్వి, అభిమానవంతుడు, ధార్మికోత్తముడు..' అంటూ (మహాభారతం-ఉద్యోగపర్వం 144-31)లో వర్ణించాడు. ఇలాంటి అంశాలన్నీ నటరత్న ఎన్టీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన పాత్రలోని మంచిచెడ్డలలో మంచినే ఎక్కువగా ప్రదర్శించాలన్న సంప్రదాయాన్ని అనుసరించారు ఎన్టీఆర్. ఆయనే కాదు తరవాత వెలసిన పురాణాల లక్ష్యం కూడా అదే! ఆ అష్టాదశ పురాణాలను సైతం 'మహాభారత' కర్త వేదవ్యాసులవారే అందించారు.

● అదే తీరున రామాయణ, భారత, భాగవతాలను అందులోని పాత్రలను ఆశ్రయించుకొని తరువాతి రోజుల్లో పలు రచనలు వచ్చాయి. ఇక తెలుగులో కవిత్రయం మూలభారతంలోని కొన్ని అంశాలను వదిలివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తీరున ఎవరికి వారు తమ స్వేచ్ఛాసృష్టితో ఆ పురాణ పాత్రలకు తమదైన రీతిలో హంగులు అద్దారు. అలా వెలసిన కథనే మనమంతా మహా కళా ఖండమని కీర్తిస్తున్న 'మాయాబజార్'(1957) చిత్ర రాజం!

● తొలి నుంచీ మన పురాణాల లక్ష్యం సామాన్యులలో సత్‌ప్రవర్తన కలుగజేయడమే! ఎన్టీఆర్ సైతం దానిని అనుసరించారు. తాను తొలిసారి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కించిన 'సీతా రామకళ్యాణం'లో రావణ పాత్రను అదే తీరున చిత్రీకరించారు. పరమశివభక్తుడైన రావణుడు స్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడని చాటారు. ఎన్నో సున్నితాంశాలను సైతం నిశితంగా చాటిన ఎన్టీఆర్ పురాణ పరిజ్ఞానాన్ని శంకించడం అనంతమైన అజ్ఞానమే అవుతుంది. 'లవకుశ' చిత్రం ఘనవిజయం తరువాత ఆ సినిమా వెలుగు చూడటానికి కారకులైన సుందర్‌లాల్ నహతా ఎన్టీఆర్‌ను ఓ కోరిక కోరారు. హిందీలో తాను తీసే సినిమాలో శ్రీకృష్ణ పాత్ర ధరిస్తే కోటి రూపాయలు పారితోషికంగా సమర్పించుకుంటానని అన్నారు నహతా. అయినా ఎన్టీఆర్ తన పౌరాణిక పాత్రలు తెలుగు వారికే సొంతం కావాలని ఆశించి, నహతా ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. తన తెలుగు జాతి అంటే ఎన్టీఆర్‌కు అంతటి అభిమానం! అలాగే తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసి సృష్టించిన చరిత్ర తెలిసిందే. ప్రజల మదిలో ఆయన నేటికీ కొలువై ఉండడానికి ఆయన పోషించిన పౌరాణిక పాత్రలు, వాటిలో చూపించిన వైవిధ్యం కారణమని చెప్పక తప్పదు. భారతీయులు పవిత్రంగా భావించే దేవతామూర్తుల పాత్రల్లో ఎన్టీఆర్ నటించలేదు, జీవించారు. అందువల్లే ఈ నాటికీ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ జీవించే ఉన్నారు. అంతటి మహానటుణ్ణి, మహానాయకుణ్ణి కొందరు స్వార్థపరులు రాజకీయం కోసం వేలెత్తి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాదిన ఓ మహా స్వాప్నికుడిని హిందువు కాదంటూ ఛిద్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే తీరున ఎన్టీఆర్ పేరును కూడా తమ పాలిటిక్స్‌కు ఉపయోగించుకోవాలనుకుంటే ఇక్కడ అటువంటివారి పప్పులు ఉడకవు. ఎందుకంటే తెలుగు నేలతో మమేకమైన - తెలుగు జనతతో పెనవేసుకున్న ఎన్టీఆర్ అనుబంధం అంతటి గాఢమైనది.

- కొమ్మినేని వెంకటేశ్వర రావు

నా రికార్డ్స్ అన్నీ అన్‌స్టాపబుల్

-నందమూరి బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో విజయోత్సవ సభను చిత్ర బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'వరుసగా ఇది నాకు నాలుగో విజయం. నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా డాకు మహారాజ్. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో ప్రేమించి, నాలో ఉన్న నట విశ్వరూపాన్ని ఆవిష్కరించేలా చేశాడు దర్శకుడు బాబీ. అలాగే మా నిర్మాత వంశీ గారు నా అభిమాని. ఈ సినిమాలో కొత్త బాలకృష్ణను ఆవిష్కరించాలని ఆయన కల కన్నారు. అన్ని క్రాఫ్ట్ మీద మంచి గ్రిప్ ఉన్న వంశీ. నా అభిమాని కావడం నాకు చాలా గర్వంగా ఉంది. మన సినిమాలను చూసి ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. నా వరకు చూసుకుంటే, నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్' అన్నారు. ఈ నెల 22న అనంతపురంలో విజయోత్సవ పండుగ నిర్వహిస్తామని బాలకృష్ణ చెప్పారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ,' బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో ఒక మాస్టర్ పీస్ సినిమా ఇవ్వడానికి కారణమైన మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్. బాలకృష్ణ గారు కథను అర్థం చేసుకొని, దర్శకుడు ఏది అడిగితే అది చేస్తారు' అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాము. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. జనవరి 12న ఈ సినిమా విడుదలైతే, సంక్రాంతి పండుగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్.' అన్నారు.



మహేశ్ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది

- వెంకటేశ్

'కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయం కాదు, తెలుగు ప్రేక్షకులది. ఈ సినిమాను ఇంతటి సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా' అని అన్నారు హీరో వెంకటేశ్. 'సంక్రాంతికి వస్తున్నాం' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పొంగల్ బ్లాక్‌బస్టర్ జాతర సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలోని అనేక మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమా చాలా నచ్చిందంటూ చిన్నోడు మహేశ్‌బాబు ట్వీట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ రోజు నాకు ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు. ప్రేక్షకుల సపోర్ట్ లేకుంటే నాకు ఏ విజయమూ దక్కేది కాదు. ఒక దర్శకుడిగా ప్రేక్షకులకు ఎంతగా రుణపడి ఉండాలో అర్థం కావడం లేదు' అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా మేము ఊహించని మహా అద్భుతం. అనిల్, వెంకటేశ్ కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్. ఈ సంక్రాంతిని మర్చిపోలేం' అని అన్నారు. మరో నిర్మాత శిరీష్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఆర్ట్స్ హరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ చిత్రం మా సమస్యలన్నింటినీ తీరుస్తుందని షూటింగ్‌లో చెప్పేవారు. ఆయన మాట నిజమైంది' అని అన్నారు.

పెద్దోడిని అభినందించిన చిన్నోడు

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సెలబ్రేషన్స్‌కు మహేశ్ హాజరై సందడి చేశారు. వెంకటేశ్‌తో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఖేల్‌రత్న పురస్కారాలు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, గుకేష్

కనుల పండుగ.. క్రీడా అవార్డుల వేడుక

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ చాంపియన్ గుకేశ్‌లతో పాటు హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ విజేత ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. వీరికి సర్టిఫికెట్, మెడల్‌తో పాటు తలా రూ.25 లక్షల రివార్డు దక్కుతుంది. అలాగే 32 మంది అథ్లెట్లు అర్జున అవార్డును అందుకోగా, ఐదుగురు ద్రోణాచార్య స్వీకరించారు. తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జివాంజితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజిలకు అర్జున దక్కింది. దీప్తి అవార్డును స్వీకరించగా, జ్యోతి శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ పురస్కారంతో పాటు రూ.15 లక్షల రివార్డు వీళ్లకు దక్కనుంది.

భావోద్వేగ సన్నివేశం..

అర్జున అవార్డు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటానికి ఫలితం దక్కింది. పారాలింపిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన 80 ఏళ్ల మురళీకాంత్ పేట్కర్ చివరకు అర్జున అవార్డు (లైఫ్ టైమ్) అందుకున్నాడు. అయితే ఈ సందర్భంలో అంతటా భావోద్వేగం చోటుచేసుకుంది. 1965లో పాకిస్థాన్‌తో యుద్ధంలో పేట్కర్‌కు బుల్లెట్



గాయం తగిలి నడుం కింది భాగానికి వైకల్యం ఏర్పడింది. ఆ తర్వాత 1972 పారాలింపిక్స్ స్విమ్మింగ్‌లో అతను స్వర్ణం సాధించాడు. ఆహూతుల హర్ష ధ్వానాల మధ్య అతను చేతి కర్రల సహాయంతో అవార్డును స్వీకరించేందుకు రాగా, రాష్ట్రపతి ముందుకు వచ్చి పేట్కర్‌ను సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది.

అమ్మాయిలూ.. అదరగొట్టాలి

● డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్

● తొలి రోజే ఆరు మ్యాచ్‌లు

● రేపు విండీస్‌తో యువ భారత్ పోరు

నేటి నుంచి అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

ఉదయం 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



కౌలాలంపూర్: భారత కొత్తతరం మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా నిరూపించుకోవాలనుకుంటున్నారు. శనివారం నుంచి మలేసియాలో అండర్-19 టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కాబోతోంది. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి మెగా టోర్నీలో షఫాలీ వర్మ నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి నికీ ప్రసాద్ కెప్టెన్సీలో టీమ్ చెలరేగి రెండో టీ20 వరల్డ్‌కప్‌ను సైతం ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటుండగా, వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్ దశకు వెళతాయి. ఆ తర్వాత రెండు సూపర్ సిక్స్ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది. ఇక భారత జట్టు గ్రూప్ 'ఎ'లో ఉండగా శ్రీలంక, వెస్టిండీస్, మలేసియా ఇతర జట్లు. ఆదివారం విండీస్‌తో జరిగే పోరుతో భారత్ తమ టైటిల్ వేట ఆరంభిస్తుంది. అయితే శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆసీస్-స్కాట్లాండ్, ఇంగ్లండ్-ఐర్లాండ్, సమోవా-నైజీరియా, బంగ్లాదేశ్-నేపాల్, పాకిస్థాన్-యూఎస్ఏ, న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా జట్లు తలపడతాయి.

భారత్ షెడ్యూల్

జనవరి 19	వెస్టిండీస్‌తో
జనవరి 21	మలేసియాతో
జనవరి 23	శ్రీలంకతో

మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 12 గం. నుంచి



త్రిష మరోసారి..

గత నెలలో జరిగిన అండర్-19 ఆసియాకప్‌లో హైదరాబాదీ జి.త్రిష విశేషంగా రాణించింది. దీంతో ఆమె వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో చోటు దక్కించుకుంది. టాపార్డర్‌లో త్రిష దూకుడు జట్టుకు ఉపయోగపడగలదు. అలాగే స్పిన్ విభాగంలో పరునిక సిసోడియా, సోనమ్ యాదవ్, ఆయుషి శుక్లా కీలకం కానున్నారు. జట్టులో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు కేసరి ధ్రుతి, షబ్నమ్‌లకు కూడా చోటు దక్కడం విశేషం.

భారత మహిళల జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాల్కే, త్రిష, కమలిని, భవిక, ఈశ్వరి, మిథిల, జోషితా, సోనమ్ యాదవ్, పరునిక, కేసరి ధ్రుతి, ఆయుషి, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

షూటర్ ముకేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మొహాలీలో జరిగిన అఖిల భారత విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ ముకేష్ రజతంతో మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ముకేష్ రెండో స్థానంలో నిలిచాడు.

చెస్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో జాతీయస్థాయి పాఠశాల చెస్ చాంపియన్‌షిప్ శుక్రవారం ఘనంగా మొదలైంది. టోర్నీని స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈనెల 21 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా ఎంపిక నేడే

ముంబై: చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును శనివారం ప్రకటించనున్నారు. 15 మందితో కూడిన ఈ ప్రాథమిక జట్టులో సెలెక్షన్ కమిటీ బుమ్రాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆసీస్‌తో చివరి టెస్టులో తను గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించనున్నారు.

స్టార్లు సాఫీగా..



సబలెంకా

ప్రీక్వార్టర్స్‌లో జొకో, అల్కారజ్, సబలెంకా, గాఫ్

ఏడో సీడ్ పెగులాకు షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకొంటూ ముందంజ వేస్తున్నారు. పురుషుల్లో..11వ టైటిల్‌పై కన్నేసిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్, నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంకా, మూడో సీడ్ కొకొ గాఫ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. అయితే మెల్‌బోర్న్ పార్క్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన నవోమి ఒసాకా గాయంతో మూడో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. ఏడో సీడ్ జెస్సికా పెగులాకు అన్‌సీడెడ్ సెర్బియా క్రీడాకారిణి ఓల్గా డానిలోవిచ్ షాకిచ్చింది. గత ఏడాది సెమీఫైనలిస్ట్ గాఫ్ 6-4, 6-2తో 2021 యూఎస్ ఓపెన్ రన్నరప్ లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తు చేసింది. టాప్ సీడ్ సబలెంకా కూడా 7-6 (5), 6-4తో క్లారా టౌసన్‌పై గెలిచింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌లలో 11వ సీడ్ పౌలా బడోసా 6-4, 4-6, 6-3తో 17వ సీడ్ కోస్త్యుక్‌ని, 14వ సీడ్ ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్‌ని, 27వ సీడ్ పల్యుచెన్కోవా 6-1, 6-2తో సీగ్మండ్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. 23 ఏళ్ల ఓల్గా డానిలోవిచ్ 7-6 (3), 6-1తో ఏడో సీడ్, యూఎస్ ఓపెన్ రన్నరప్ పెగులాపై సంచలన విజయం సాధించింది. 12వ సీడ్ ష్నీడెర్‌కు 7-6 (4), 6-7 (7), 7-5తో 18వ సీడ్ వెకిక్ షాకిచ్చింది. మరోవైపు నవోమి ఒసాకా 6-7 (7)తో టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ బెలిండా బెన్సిక్‌తో తొలి సెట్‌ను కోల్పోయిన దశలో పొత్తి కడుపు నొప్పితో మ్యాచ్ నుంచి నిష్క్రమించింది. పురుషుల మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో టోమస్ మకాక్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. అయితే రెండో సెట్‌లో జొకో శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. ఆపై చికిత్స తీసుకొని మ్యాచ్‌ను కొనసాగించాడు. రెండో సీడ్ జ్వెరేవ్ 6-3, 6-4, 6-4తో ఫెర్న్‌లీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-7 (7), 6-2తో బోర్గెస్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 7-6 (0), 6-2, 6-0తో కార్బలెస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

మిక్స్‌డ్‌లో బోపన్న జోడీ బోణీ

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత వెటరన్ రోహన్ బోపన్న మిక్స్‌డ్‌లో బోణీ చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న/షుయ్ జాంగ్ (చైనా) ద్వయం 6-4, 6-4తో డోడిగ్/క్రిస్టియానాపై నెగ్గి రెండోరౌండ్ చేరింది.

సింధుకు చుక్కెదురు

● సెమీస్‌కు సాత్విక్ జోడీ

● ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో మాజీ చాంపియన్ సింధు 9-21, 21-19, 17-21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 2017లో ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధు.. ఆ మరుసటి ఏడాది రన్నరప్‌గా నిలిచింది. కాగా, పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక ఆటగాడు కిరణ్ జార్జ్ 13-21, 19-21తో చైనా షట్లర్ వెంగ్ హంగ్‌యాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 21-17తో కొరియా జోడీ కాంగ్ మిన్ హ్యూక్/హో జిన్‌ను చిత్తుచేసి సెమీస్ చేరింది. ఫైనల్ బెర్త్ కోసం మలేసియా జంట గో జె ఫె/ఇజుద్దీన్ కాన్‌తో సాత్విక్ ద్వయం తలపడనుంది.



సీఎం చంద్రబాబును కలిసిన హంపి

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ సాధించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా హంపిని చంద్రబాబు అభినందించారు. తెలుగు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన హంపి.. భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు గెలవాలని సీఎం ఆకాంక్షించారు. హంపి వెంట ఆమె కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.

విజయ్ హజారే టోర్నీ ఫైనల్ నేడు | కర్ణాటక X విదర్భ మ. 1.30 నుంచి

'ఆటో' పెట్టుబడుల కేంద్రంగా భారత్

నాలుగేళ్లలో వాహన రంగంలోకి రూ.3.09 లక్షల కోట్ల ఎఫ్‌డీఐ

ఏడాదిలో 2.5 కోట్ల వాహనాల విక్రయం.. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రధాని



న్యూఢిల్లీ: మొబిలిటీ రంగం భవిష్యత్తు భారత్‌దేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో గత ఏడాది రికార్డు స్థాయిలో రెండున్నర కోట్ల వాహనాలు అమ్ముడుపోయాయని, అనేక దేశాల జనాభా కన్నా మన దేశంలో కార్ల అమ్మకాలు అధికమని చెప్పారు. కేవలం నాలుగేళ్ల కాలంలో మొబిలిటీ రంగంలోకి 3,600 కోట్ల డాలర్ల (రూ.3.09 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మొబిలిటీ (ఆటోమొబైల్) రంగంలో తన భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్‌కు భారత్ అద్భుతమైన గమ్యమన్నారు. ఆటోమోటివ్ పరిశ్రమకు ఇన్నోవేషన్, టెక్నాలజీలే చోదకమని పేర్కొంటూ "ప్రపంచం కోసం దేశంలో తయారుచేయండి" అనే మంత్రంతో ముందడుగేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి మద్దతు, ప్రోత్సాహం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "మేక్ ఇన్ ఇండియా" మంత్రం ఆటోమొబైల్ రంగం వృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎల్ఐ పథకాలు ఈ ప్రచారానికి కొత్త ఉత్తేజం కల్పించడంతో పాటు రూ.2.25 లక్షల కోట్ల విక్రయాలు, 1.5 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలకు బాట వేశాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ, మూడో పెద్ద ప్రయాణికుల వాహన మార్కెట్‌గా ఉందన్నారు. అధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి జీవులు, వేగవంతమైన నగరీకరణ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, అందుబాటులోకి వస్తున్న అఫర్డబుల్ వాహనాలు మొబిలిటీ మార్కెట్‌కు బలమని ఆయన అన్నారు.

వేగంగా విస్తరిస్తున్న ఈవీ మార్కెట్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని చెప్పారు. గత దశాబ్ది కాలంలో ఈవీ విక్రయాలు 640 రెట్లు పెరిగాయన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి 2,600 ఈవీలు అమ్ముడుపోగా గత ఏడాది ఆ సంఖ్య 16.8 లక్షలకు చేరిందన్నారు. ఈ దశాబ్ది చివరి నాటికి ఈ సంఖ్య 8 రెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.

రతన్ టాటా, ఒసాము సుజుకీలకు నివాళి

ఆటోమొబైల్ దిగ్గజాలైన రతన్ టాటా, ఒసాము సుజుకీలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత ఆటోమొబైల్ వృద్ధికి, మధ్య తరగతి ప్రజల కలల సాకారానికి వారిద్దరి సేవలు చిరస్మరణీయమన్నారు. మొత్తం భారత మొబిలిటీ రంగానికి వారిద్దరి వారసత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందని నివాళి ఘటించారు.

మెర్సిడెస్ బెంజ్ రెండు కొత్త కార్లు



మెర్సిడెస్ బెంజ్ సరికొత్త బ్యాటరీ విద్యుత్ కారు (బీఈవీ) ఈక్యూఎస్ మేబాక్ ఎస్‌యూవీ 680 "నైట్ సీరీస్"ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.63 కోట్లు. దీనితో పాటు మెర్సిడెస్ మేబాక్ జీఎల్ఎస్ 600 నైట్ సీరీస్ కారు కూడా విడుదల చేసింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.71 కోట్లు. ఇవి కాకుండా కొత్తగా డెవలప్ చేసిన కాన్సెప్ట్ సీఎల్ఏ కారును ఆవిష్కరించింది.



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సైబర్‌స్టర్

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ రెండు కొత్త ఈవీ మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఎంజీ సైబర్‌స్టర్ కారు దేశంలోని తొలి ఆల్ ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ కారు. రెండోది ఎంజీ ఎం9. ఇది మూడు వరుసలున్న తొలి విద్యుత్ లిమోసిన్ కారు. ఈ రెండు కార్లను ఈ ఏడాదే మార్కెట్లో విడుదల చేస్తారు. ఈ కార్లతో తాము యాక్సెసిబుల్ లగ్జరీ విభాగంలోకి ప్రవేశించినట్టు కంపెనీ ప్రకటించింది.

బీఎండబ్ల్యూ ఇండియా ఈవీ



జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ పూర్తిగా స్థానికంగా తయారు చేసిన బీఎండబ్ల్యూ ఎక్స్ 1 లాంగ్ వీల్ బేస్ ఈవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.49 లక్షలు. దీన్ని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. బీఎండబ్ల్యూ నుంచి పూర్తిగా దేశీయంగా తయారైన తొలి ఈవీ ఇది.



పోర్షే కొత్త విద్యుత్ ఎస్‌యూవీ

జర్మనీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్షే సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ మకాన్, సరికొత్త హంగులతో తీర్చిదిద్దిన స్పోర్ట్ సెలూన్ టైకాన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మకాన్ బీఈవీ మూడు మోడళ్లలో అందుబాటులో ఉంటుంది. ధర రూ.1.22 కోట్ల నుంచి రూ.1.69 కోట్ల మధ్యన ఉంటుంది. కొత్త హంగులతో విడుదల చేసిన టైకాన్ ధర రూ.1.89 కోట్ల నుంచి రూ.2.53 కోట్ల మధ్యన ఉంటుంది.

సుజుకీ తొలి విద్యుత్ స్కూటర్



సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విద్యుత్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను, మరో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఈ యాక్సెస్ 3.07 కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇతర మోడళ్లలో జిక్సర్ ఎస్ఎఫ్ ఫ్లెక్స్ ఫ్యుయెల్ బైక్, పూర్తిగా కొత్తగా తయారుచేసిన యాక్సెస్ 125 సీసీ స్కూటర్ ఉన్నాయి.



హీరో మోటోకార్ప్

టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త వాహనాలను ప్రదర్శించింది. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ ద్వారా 250 సీసీ వాహనాల విభాగంలోకి తొలిసారిగా ప్రవేశించింది. అలాగే ఎక్స్‌పల్స్ 210 బైక్, జూమ్ 125, జూమ్ 160 స్కూటర్లు కూడా ప్రదర్శించిన వాహనాల్లో ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి వాహనాల డెలివరీ ప్రారంభిస్తారు.

బిజినెస్

విప్రో లాభంలో 24 శాతం వృద్ధి

క్యూ3లో రూ.3,354 కోట్లుగా నమోదు

ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24.4 శాతం వృద్ధితో రూ.3,354 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి కంపెనీ ఆదాయం కేవలం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లుగా నమోదైంది. ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం(క్యూ4)లో ఐటీ సేవల ద్వారా సమకూరే ఆదాయం 260.2-265.5 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే క్యూ4లో ఐటీ సేవల ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని అంచనా. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరు కు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.

12,000 నియామకాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000-12,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు విప్రో వెల్లడించింది. కాగా డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,157 తగ్గి 2,32,732కు పరిమితమైంది.

కస్టమర్లకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్‌నే ఉపయోగించండి

బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలను నిరోధించేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు లావాదేవీల విషయమై ఖాతాదారులకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్ నంబర్లను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. అలాగే, ప్రచార అవసరాల కోసం '140XX' సిరీస్ నంబర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించింది. అంతేకాదు, బ్యాంకులు, ఇతర నియంత్రిత సంస్థలు తమ కస్టమర్ల డేటాబేస్‌ను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తుండాలని సూచించింది. మార్చి31 నాటికి ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

అకౌంట్లు, లాకర్లకు నామినీలుండాల్సిందే: మరణించిన ఖాతాదారు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు అన్ని ఖాతాలు, లాకర్లకు నామినీ వివరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. ప్రస్తుత, కొత్త డిపాజిట్ అకౌంట్లు, సేఫ్టీ లాకర్లకు నామినీలను నిర్ధారించాలని కోరింది.

మారుతి ఈ-విటారా



దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. ఈ కారు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేసి 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మోడల్‌కు భారత్‌ను ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా చేయాలనుకుంటున్నట్లు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గరిష్ఠ స్థాయి ముడిచమురు ధరలు సైతం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 780 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, మళ్లీ కాస్త కోలుకుంది. చివరికి సూచీ 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.60 పాయింట్లు కోల్పోయి 23,203.20 వద్ద క్లోజైంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	131
వరంగల్	112	గుంటూరు	130
కరీంనగర్	112	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	127	అనంతపురం	109
గోదావరి	131		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	503	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,270 ▲	74,500 ▲	1.04,000 ▲
విజయవాడ	81,820 ▲	77,000 ▲	93,500 ▲
విశాఖపట్నం	79,290 ▲	72,680 ▲	91,760 ▼
రాజమండ్రి	84,270 ▲	74,500 ▲	91,700 ▲
ప్రొద్దుటూరు	80,350 ▲	74,400 ▲	93,500 ▼
ముంబై	79,239 ▲	72,583 ▲	90,820 ▼

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd.,Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Racharla Road, Alampuram, Tadepalligudem - 534 166, West Godavari District, Andhra Pradesh. Editor : **N.Rahul Kumar,** Phone No: 08818 - 280013.RNI No:APTEL/2003/09832. Managing Director : **Vemuri Radhakrishna**. Founder : K.L.N. Prasad.



దేవపూడిలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి : ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపించాలని, అదే సమయంలో పార్టీని పటిష్ఠం చేసేందుకు కృషి చేయాలని శాసన మండలి సభ్యుడు, పార్టీ నాయకులు జయమంగళ వెంకటరమణ కోరారు. ముదినేపల్లి మండలం దేవపూడి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ దాసరి గోపాలకృష్ణ జ్ఞాపకార్థం జన సేన మండల మాజీ అధ్యక్షులు దాసరి రమేష్, సర్పంచ్ కాశీ అన్నపూర్ణ దేవి ఆధ్వర్యంలో జయ మంగళ మొక్కలు నాటారు. నాయకులు పన్నాస ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తిరగబడిన ఆటో : ఒకరికి గాయాలు

ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో గురజ గ్రామానికి చెందిన తొండూరు నాగరాజు తీవ్ర గాయాలకు గురయ్యాడు. మచిలీపట్నం నుంచి గురజ గ్రామంలోని చేపల చెరువుల వద్దకు మేత కట్టలు తీసుకొచ్చిన ఆటో తిరిగి ముదినేపల్లి నుంచి మచిలీపట్నం వెళ్తుండగా, జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న గోతుల్లో బోల్తా పడింది. ముదినేపల్లిలో ఆటో ముగ్గురు ఎక్కగా వారిలో నాగరాజు అనే వ్యక్తి ప్రమాదంలో గాయాలకు గురయ్యాడు. వెంటనే పోలీసులు అతనిని 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ముదినేపల్లి వద్ద బోల్తా పడిన ఆటో

ప్రయాణికులు లేక చర్లపల్లి రైలు వెలవెల



ఏలూరులో ఖాళీగా ఉన్న రైలు

ఏలూరు క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా రైల్వేశాఖ ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఏర్పాటు చేసిన రైలు ప్రయాణికులు లేక శుక్రవారం ఖాళీగా వెళ్ళిపోయింది. ప్రత్యేక రైళ్ళను విశాఖపట్నం నుంచి చర్లపల్లి, సికింద్రాబాద్‌కు కాకినాడ పోర్టు నుంచి సికింద్రాబాద్‌కు, చర్లపల్లికి ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీ లేకపోవడంతో ఆ రైళ్ళల్లో రిజర్వేషన్ చేయించుకోకపోవడంతో కొన్ని రైళ్ళను రద్దు చేశారు. మళ్ళీ ప్రయాణికుల రద్దీ ఉందని భావించి వెంటనే ఈనెల 15వ తేదీన రైల్ నెంబర్ 085 22 విశాఖపట్నం నుంచి చర్లపల్లి వరకు జన సాధన ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. ఈ రైలులో ప్రయాణికులు టిక్కెట్ తీసు కుని ఎక్కవచ్చు. ఎలాంటి రిజ ర్వేషన్ ఉండదు. ఈ ప్రత్యేక రైలు శుక్రవారం ఉదయం విశాఖప ట్నంలో 9.45 గంటలకు బయలుదేరింది. ఏలూరునకు శుక్రవారం మధ్యాహ్నం 2.25 గంటలకు రావాల్సి ఉండగా 3 గంటలకు వచ్చింది. కానీ ఈ రైలు ప్రారంభం నుంచి కూడా ప్రయాణికులు లేకపోవడంతో భోగీలో ఒకరిద్దరు మాత్రమే కనిపించారు. ఏలూరు మీదుగా ఈ రైలు విజయవాడకు వెళింది. చర్లపల్లికి రాత్రి 10.30 గంటలకు చేరుకుంటుంది.

రేపు నరసాపురం నుంచి ప్రత్యేక రైలు

నరసాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకుని ఆదివారం నరసాపురం నుంచి చర్లపల్లికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఎస్ఎం మధుబాబు చెప్పారు. నరసాపురంలో రాత్రి 9గం టలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లికి వెళుతుందన్నారు. పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, ఖమ్మం, వరంగల్ మీదుగా వెళుతుందన్నారు.

నేడు జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష

ఏలూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు శనివారం పరీక్ష జరుగనుంది. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, భీమడోలు, మండవల్లి, కైకలూరు, చింతలపూడిలలో ఏర్పాటు చేసిన 13 కేంద్రాల్లో మొత్తం 3148మంది బాలబాలికలు ప్రవేశ పరీక్షకు దరఖాస్తుచేసుకున్నారు. ఎక్కడా అవాం ఛనీయ సంఘటనలకు తావులేకుండా స్థానికం గా ఉండే డిప్యూటీ తహసీల్దార్లను పరీక్ష కేంద్రా లను పర్యవేక్షించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ ప్రవేశపరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు హాల్‌టిక్కెట్‌తోసహా ఉదయం 10గంటలకే చేరుకోవాలని, ఉదయం 11.30 తర్వాత ఎవరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులు వారికిచ్చిన ఓఎంఆర్ తమకు సంబంధించిందో, కాదో ముందుగా సరిచూసుకున్న తర్వాతే నిర్దేశించినచోట సంతకం చేయాలని సూచించారు. బ్లాక్ లేదా బ్లూ కలర్ బాల్ పాయింట్ పెన్‌తో మాత్రమే జవాబులను బబుల్‌చేయాలని కోరారు. అభ్యంతరకరమైన ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షకేంద్రంలోకి అనుమతించబోమని, ఇటువంటి వస్తువులతో ఎవరైనా పట్టుబడితే పరీక్షకు సంబంధిత విద్యార్థిని అనర్హులుగా చేస్తామని హెచ్చరించారు. పరీక్ష నిర్వహణలో సందేహాల నివృత్తికి డీఈవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ నెంబర్లు 63030 39477, 94907 28768, 96406 76608, 90785 68664, 80748 33690, 94917 31486లలో సంప్రదించాలని కోరారు.

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు



మాట్లాడుతున్న రవాణాశాఖ అధికారి నాగమురళి

నూజివీడు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):నూజివీడు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జరిగాయి. తిరివీధి లక్ష్మీరామారావు చారిటబుల్‌ట్రస్ట్, ఆర్టీసీ కార్మికులు, ఆటోడ్రైవర్ల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ప్రాంతీయరవాణాశాఖ అధికారి జి.నాగమురళీ, నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజరు పవన్‌కుమార్‌లు మాట్లాడుతూ వాహనచోదకులు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనార్టీ తీరని వారికి వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు టి.కృష్ణ మాట్లాడుతూ తమసంస్థ తరపున వాహనచోదకులకు ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ నూజివీడు డిపో సూపర్ వైజర్ టి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రోడ్డుప్రమాదాలు జరిగి నప్పుడు గోల్డెన్ అవర్‌గా చెప్పబడే మొదటి 60 నిమిషాల సమయం ఎంతో విలువైందన్నారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించాలన్నారు. ఇలా సాయం చేసేవారికి కేంద్రప్రభుత్వం రూ.25 వేలు పారితోషికం కూడా ఇస్తుందన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని రక్షించేందుకు ప్రతిఒక్కరూ రక్తదాతలుగా ఎదగాలన్నారు.

కొనలేం...మేపలేం..!

పశుపోషకుల ఆవేదన

భారీగా పెరిగిన వరిగడ్డి ధర

ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం ధరలకు రెక్కలు వచ్చినా వరి గడ్డి కొనక తప్పడం లేదు. ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాల వల్ల పలు ప్రాంతాల్లో సార్వా వరి పైరు దెబ్బతినటంతో వరి గడ్డికి డిమాండ్ పెరిగింది. ఎకరం వరి గడ్డి ధర గతంలో ఆరు నుంచి ఎనిమిది వేల రూపాయలు ఉండేది. గత ఏడాది పంట చేతికి దక్కనున్న సమయంలో తుఫాన్ సంభవించి వరి పైరు ముంపునకు గురై ఆ ధర రూ.10 వేలకు పెరిగింది. వరుసగా ఈ ఏడాది కూడ భారీ వర్షాల వల్ల ముదినేపల్లి ప్రాంతంలో వరి పైరుకు నష్టం వాటిల్లటంతో స్థానికంగానే కాక పశ్చిమ, ఏలూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి పశుపోషకులు వరి గడ్డి కోసం ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో ధరను పెంచేశారు. ప్రస్తుతం ఎకరంలోని వరి గడ్డి ధర రూ.14 వేలకు పెరిగింది. ముదినేపల్లి ప్రాంతంలో పశువులు లేని పలువురు రైతులు, కౌలు రైతులు తమ పొలాల్లోని వరి గడ్డిని ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. పంట నష్టపోయిన రైతులు వరి గడ్డి అమ్మకం ద్వారానైనా కొంత వరకు ఆ నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, ఆచంట, ఆకివీడు, కాళ్ల మండలాల ప్రాంతాల నుంచి కృష్ణా జిల్లా ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పశుపోషకులు వస్తుండడంతో వరి గడ్డికి డిమాండ్ పెరిగింది.



టీడీపీ సీనియర్ నేత కోడూరు మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కోడూరు వెంకటేశ్వరరావు (85) మరణించారు. కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుది శ్వాస విడిచారు. 1983లో ఎన్టీఆర్ పిలుపుతో ముదినేపల్లిలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి పార్టీ పట్ల అంకిత భావంతోనే పని చేశారు. ఆయన మృతి పట్ల కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహన రావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తూరు విఠల్, జిల్లా కార్యదర్శి కోడూరు శేషుబాబు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ అడుసుమిల్లి సాయికృష్ణ, ముదినేపల్లి ఉపసర్పంచ్ ఈడే సుధాకర్ తదితరులు సంతాపం తెలిపారు.

వాడుక నీరు రోడ్డు మీదకు వదలొద్దు : కార్యదర్శి

ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెనుమల్లి శివారు సింగారం గ్రామంలో మురుగునీటి పారుదల సౌకర్యం ఏర్పాటుపై శుక్రవారం పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి హారిక పరిశీలించారు. గ్రామంలో ఇళ్ల నుంచి వాడుక నీరు రోడ్డు మీదకి వచ్చి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడటం, దుర్వాసన వస్తోందని ఆ గ్రామానికి చెందిన గూడపాటి ప్రసాద్ అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ నిర్వహించారు. వృథా నీరు రోడ్డు మీదకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సంబంధిత గృహ యజమానులకు సూచించారు.



మంచానికే పరిమితమైన దివ్యాంగుడు సురేష్

మంచానికే పరిమితం..!

17 ఏళ్లుగా దివ్యాంగ పింఛన్ కోసం ఎదురుచూపులు

నూజివీడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే దివ్యాంగుడు. ఇప్పటికి 17 ఏళ్ల వయసు వచ్చినా దివ్యాంగ పింఛన్ మాత్రం అందడం లేదు.17 ఏళ్లుగా తల్లి దండ్రులు తమ కుమారుడికి పింఛన్ కోసం తిరుగుతూనే ఉన్నారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన మందపాటి సాంబశివరావు, శివరంగమ్మలకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు సురేష్ (17) పుట్టుకతోనే దివ్యాంగుడు. పూర్తిగా మంచానికే పరిమితం. కూలిపనులు చేసుకుని సాంబశివరావు కుటుంబాన్ని పోషిస్తూ ఉంటాడు. తల్లి శివరంగమ్మ కుమారుడి ఆలనాపాలనా చూడటానికే పరిమితమైంది. విజయవాడ ప్రభుత్వా ఆసుపత్రికి వెళ్లినా తమను పట్టించుకున్న వైద్యులు కాని, నాయకులు కాని లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సురేష్‌కి ఆధార్ కార్డు కోసం రెండుసార్లు తీయించినా వేలిముద్రలు పడటం లేదని పింఛన్ మంజూరు చేయడం లేదని వాపోయారు. తమ కుమారుడికి దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని కోరుతున్నారు.



వినతపత్రం ఇస్తున్న నాగబాబు

సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం పవన్‌కు వినతి

ముసునూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించాలని రమణక్కపేటకు చెందిన జనసేన నాయకుడు పాశం నాగబాబు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కోరారు. శుక్రవారం సచివాలయం వద్ద మంత్రిని కలిసి సమస్యలపై వినతపత్రం అందజేశారు. అటవీ భూముల్లో పేదలకు పట్టాలు ఇవ్వాలని, గ్రామపంచాయితీల్లో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి మరిన్ని నిధులు కేటాయించాలని, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

సంతోషపురం మాజీ సర్పంచ్ హత్య



నల్లయ్య (ఫైల్)

కలిదిండి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంతోషపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాల్వ నల్లయ్య(60)ను అదే గ్రామానికి చెందిన బోదనపు శ్రీనివాసరావు గురువారం సాయంత్రం హత్య చేశాడని ఎస్ఐ వెంకటేశ్వ రరావు తెలిపారు. ఏడాది క్రితం శ్రీనివాసరావు కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డు. తన కుమారుడు చనిపోవడానికి ప్రధాన కారణం నల్లయ్య అని శ్రీనివాసరావు భావిస్తు న్నట్టు ప్రచారం జరుగుతోంది. గురువారం సాయంత్రం సంతోషపురం నుంచి బైక్‌పై కలిదిండి వెళ్తున్న నల్లయ్యను మార్గంమధ్యలో శ్రీనివాసరావు అడ్డగించి ఇనుపరాడ్డుతో బలంగా తల వెనుక భాగంలో కొట్టడంతో నల్లయ్య అప స్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందు తూ మృతి చెందాడు. శ్రీనివాసరావు కోసం పోలీసులు గాలిస్తున్నారు. కైకలూరు సీఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక

పూర్వ విద్యార్థుల కలయిక

ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ 2009-11 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలసి అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆప్యాయతను పంచుకున్నారు. అప్పటి ప్రిన్సిపాల్ కృపావరం, లెక్చరర్లు మల్లిఖార్జునరావు, రాంబాబు, విశ్వనాథం, చక్రవర్తి, శ్రీనివాసరావు, విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు.



రమణక్కపేటలో పూర్వవిద్యార్థులు, గురువులు

రమణక్కపేటలో..

ముసునూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట జడ్పీ పాఠ శాల 2003-04 పదో తరగతి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు కలుసుకుని ఆనాటి సంఘటనలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ఆట, పాటలతో ఉత్సహంగా గడి పారు. గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అరుణ్ కుమార్, మీరానాగూర్ ఆధ్వర్యం వహించారు. పాఠశాలకు జిరాక్స్ మిషన్‌ను అందజేశారు. హెచ్ఎం రామకృష్ణా రావు, గుప్తా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒక యువకుడు శుక్రవారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడిక క్కడే మృతి చెందాడు. ఒడిశాకు చెందిన లోక్‌నాథ్ మిరిడియా (33) స్వీట్ మేజిక్ కార్ఖానాలో పనిచేస్తున్నాడు. మిత్రులతో కలసిశుక్రవారం రాత్రి వట్లూరు రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు లోక్‌నాథ్ మిరిడిని ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ పి.సైమన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ లక్ష్యానికి తుప్పు

చెత్త సేకరణ వాహనాలు నిరుపయోగం



చెత్త సేకరణ వాహనం

ముసునూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాలు ప్రచార ఆర్భాటానికే పరిమితమవుతున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రాలకు గ్రామాల్లో చెత్తను తరలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ఆదేశాలకు సైతం అధికారులు, పాలకులు తూట్లు పొడుస్తున్నారు. గ్రామాల్లో చెత్త ఎక్కడికక్కడ రోడ్లు వెంబడి కనిపిస్తోంది. అటు పల్లెల్లో స్వచ్ఛత ఇటు యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో 2014-2019 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విద్యుత్ ఆటోలను సమకూర్చింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని నీరుగార్చింది. చెత్త తరలించే వాహనాల పట్టింపు విస్మరించి పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది. దీంతో రూ.లక్షల విలువైన వాహనాలు తుప్పుపట్టి మండల వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యాలయాల వద్ద మూలకు చేరి నిరుయోగంగా దర్శినమిస్తున్నాయి. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులు, ఈవోపీఆర్డీ, డీఎల్‌పీవో, డీపీవోల పాత్ర కీలకమైనది. వీరంతా పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో చెత్తను సేకరించి, సంపద కేంద్రాలకు తరలించకుండానే జీతాలు ఇస్తున్నా, కనీస పర్యవేక్షణ కానీ సమీక్షలు నిర్వహించడం కాని అధికారులు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాలకు మరమ్మతులను నిర్వహించి వినియోగంలోకి తెస్తే ప్రయోజనం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో పరిశుభ్రత, పారి శుధ్యంపై పలు కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అధికారులు ప్రచారానికి మాత్రమే పరిమితం చేస్తారా? లేదా కనీసం ఇప్పటి నుంచి గ్రామాల్లో పారుశుధ్య మెరుగు చర్యలు చేపడతారా చూడాల్సి ఉంది. దీనిపై ఈవోపీ ఆర్డీ సత్యనారయణను వివరణ కోరగా వాహనాలను వినియోగంలోకి తీసుకు వచ్చి చెత్తసేకరణకు త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇంటర్వ్యూ..

కాల్వలను అభివృద్ధి చేస్తాం..



గుడిసేవ సురేష్ బాబు, పెదగొన్నూరు, డీసీ చైర్మన్

- **డీసీ పరిధిలో ఇరిగేషన్, డ్రెయినేజీ సమస్యలను గుర్తించారా?**

జవాబు : పెదగొన్నూరు డిసి పరిధిలో పంట కాల్వలు, మురుగు కాల్వల సమస్యలు గత ఐదేళ్లలో పేరుకుపోయాయి.

- **ప్రధాన కాల్వల పరిస్థితి ఏమిటి?**

జవాబు : మండలంలోని క్యాంప్ బెల్, ప్రధాన పంట కాల్వ, పెదలంక మేజర్ డ్రెయిన్, ఇతర మీడియం డ్రెయిన్లు పూడిక పోయినా వాటి తవ్వకాలను చేపట్టలేదు.

- **రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి మీ ప్రణాళిక ఏమిటి?**

జవాబు : నిర్లక్ష్యానికి గురైన పంట, మురుగు కాల్వల అభివృద్ధికి, ముంపు సమస్య నివారణకు ఆయా శాఖల అధికారులతో చర్చించి పనుల ప్రణాళిక రూపొందిస్తాం.

- **పెదలంక డ్రెయిన్ ప్రక్షాళనకు ఏ చర్యలు తీసుకుంటారు.?**

జవాబు : పెదలంక మేజర్ డ్రెయిన్‌తో పాటు మీడియం, మైనర్ డ్రెయిన్లలో ఖరీఫ్ నాట్లు వేసే నాటికి ముందుగా డెక్క, తూడు, కిక్కిస తొలగింపు పనులు పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉన్నాం.

- **గత ఐదేళ్లలో సాధ్యం కానిది ఇప్పుడు ఎలా సాధ్యం?**

రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం నీటి పారుదల, మురుగునీటి పారుదల వ్యవస్థల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి పెట్టింది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, పెదగొన్నూరు గ్రామ ప్రముఖుడు, సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్.నారాయణ సహకారంతో కాల్వల బాగుచేతకు ప్రభుత్వం నుంచి నిధులు సాధిస్తాం.



సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

వ్యవసాయ విద్యుత్ 9 గంటలు ఇవ్వాలి

ముసునూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్‌ను నిరంతరంగా 9 గంటలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని చిల్లబోయినపల్లి సబ్‌స్టేషన్ వద్ద రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. రైతులు కందపు వెంకటేశ్వరరావు, కె.చిరంజీవి, రాజులపాటి రాంబాబు, కె.రాజబాబు తదితరులు మాట్లాడుతూ గత కొద్దిరోజుల నుంచి 7 గంటలు మాత్రమే వ్యవసాయ విద్యుత్ ఇస్తున్నారన్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో వ్యవసాయ విద్యుత్ సమయాన్ని తగ్గిండం వల్ల తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోయారు. 9 గంటల వ్యవసాయ విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కైకలూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులందరూ గమనించాలని కోరారు.

20 నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

కైకలూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి 31 వరకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కైకలూరు ఏడీ డాక్టర్ పి.ముస్తాఫాఖాన్ తెలిపారు. 20వ తేదీ నుంచి ప్రతి రోజూ కైకలూరు, కలిదిండి మండలాల్లో ప్రతి మండలంలో రోజుకు రెండు గ్రామాల చొప్పున వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ వైద్య శిబిరాల్లో నూడుగట్టు, గర్భవ్యాధి నివారణ టీకాలు, గొర్రెలు, మేకలుకు ఉచితంగా నట్టల నివారణ మందులను అందజేస్తామన్నారు.

23న మండల పరిషత్ సమావేశం

ఆగిరిపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23న ఎంపీపీ గోళ్ళఅనూష అధ్యక్షతన నిర్వహి స్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తమశాఖల సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

22న జాబ్ మేళా

ఏలూరు రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఈనెల 22న నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి సి.మధుభూషణ్ రావు శుక్రవారం తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలోని క్యాడ్బరీ మోండలిజ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు.